# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

అమరావతి
మంగళవారం
08-10-2024
వెల. రూ.5
• సంపుటి : 8 • సంచిక: 287
పేజీలు : 8

Amaravathi | Tirupathi | Kurnool | Eluru | Visakhapatnam | Ananthapuramu | Kadapa | Hyderabad | Karimnagar | Nizamabad | Nallagonda | Mahaboobnagar | Warangal | Khammam




## బహుజన హక్కులు కాపాడతాం

ప్రతి ఒక్కరూ సోదర భావంతో ఉన్నప్పుడే అందరికీ సమాన హక్కులు : రాహుల్

7

దళిత కుటుంబంతో కలిసి వంట చేసిన వీడియోను పంచుకున్న నేత



# నక్సలైట్లతో అంతిమ యుద్ధం

2026 మార్చి నాటికి నక్సలిజం నిర్మూలన..

త్వరలో మావోయిస్ట్ రహిత రాష్ట్రంగా ఛత్తీస్‌గఢ్

ఛత్తీస్‌గఢ్ విజయం అందరికీ ప్రేరణ

తీవ్రవాదం అంతానికి కలిసి పని చేద్దాం

ఆయుధాలు వదిలేసిన 13 వేల మందికి పైగా మావోలు

గిరిజనులకు అభివృద్ధి పథకాలు చేర్చాలన్నదే లక్ష్యం

మావోయిస్ట్ ప్రభావిత రాష్ట్రాల సమావేశంలో అమిత్ షా

నక్సలైట్ల ఏరివేతలో తెలంగాణ, ఏపీ సంపూర్ణ సహకారం

వివరాలు 7లో...



## మాల్దీవుల పర్యటనకు రండి!



భారతీయులకు ముయిజ్జు విజ్ఞప్తి

మాల్దీవుల్లో రూపే కార్డు సేవలు ప్రారంభం

మాల్దీవులకు ఎల్లవేళలా భారత్ అండ

అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జుకు ప్రధాని హామీ

ఇరు దేశాల మధ్య ఉన్నతస్థాయి భేటీలో పలు చర్చలు

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** తమ దేశంలో పర్యటనకు రావాలని మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు భారతీయులకు విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీపై మాల్దీవుల మంత్రుల వివాదాస్పద వ్యాఖ్యలు, భారత్‌తో విభేదాలతో తమ పర్యాటక ఆదాయం పడిపోయిన నేపథ్యంలో ఆయన ఈ పిలుపునిచ్చారు. ఐదు రోజుల పర్యటన నిమిత్తం ఆదివారం భారత్‌కు వచ్చేసిన ముయిజ్జు, సాజిదా దంపతులు సోమవారం రాజ్‌ఘాట్‌లో మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. అంతకుముందు వారికి రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ ఘనస్వాగతం పలికారు. తర్వాత ప్రధాని మోదీతో ముయిజ్జు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఇరుదేశాలూ పలు ఒప్పందాలు చేసుకున్నాయి. అనంతరం మోదీతో సంయుక్త విలేకరుల మిగతా 7లో...



## ఫలితాలపై ఉత్కంఠ!

హరియాణా, కాశ్మీర్‌లో ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

రెండు రాష్ట్రాల్లో నేడు ఓట్ల లెక్కింపు

## కాంగ్రెస్ విజయం ఖాయం

ప్రజలు మళ్లీ కాంగ్రెస్‌కు పట్టం కట్టబోతున్నారు

కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం



వివరాలు 7లో

## స్వర్ణాంధ్ర @2047 సాకారానికి సహకరించండి



విశాఖ రైల్వే జోన్‌కు డిసెంబర్‌లో శంకుస్థాపన చేయండి

ప్రధానికి చంద్రబాబు వినతి

వరదలతో దెబ్బతిన్న రాష్ట్రానికి మరిన్ని నిధులివ్వాలని అభ్యర్థన

పోలవరం నిధులకు కేంద్ర కేబినెట్ ఆమోదంపై కృతజ్ఞతలు

త్వరగా నిధులిస్తే నవంబర్‌లోనే పనులు మొదలుపెడతామని వెల్లడి

అనంతరం రైల్వే మంత్రితో చర్చలు

రాష్ట్ర మౌలిక వసతుల ప్రాజెక్టుల్లో రైల్వే పెట్టుబడులు 73,743 కోట్లు

హౌరా-చెన్నై 4 లైన్లుగా మార్పు

73 రైల్వే స్టేషన్ల ఆధునీకరణ

మరిన్ని లోకల్ రైళ్లకు పచ్చజెండా

'ఎక్స్'లో చంద్రబాబు వెల్లడి

నేడు గడ్కరీ, గోయల్, పురీలతో భేటీ

అమిత్ షా, నిర్మలతోనూ చర్చలు

2



## తిరుమలలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

కల్పవృక్ష వాహన సేవలో దర్శనమిచ్చిన శ్రీవారు

మాడవీధుల్లో ఆకట్టుకున్న కళాబృందాల ప్రదర్శనలు

నేటి గరుడోత్సవానికి భారీగా ఏర్పాట్లు చేసిన టిడిడి

**తిరుమల, అక్టోబర్ 7 (మనం న్యూస్):** కలియుగదైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన సోమవారం ఉదయం కల్పవృక్ష వాహన సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా – మిగతా 2లో...

## వన్యప్రాణుల రక్షణ మన బాధ్యత



జీవవైవిధ్యంపైనే మనిషి ఉనికి ఆధారపడి ఉంది

ప్లాస్టిక్ వినియోగం తగ్గిస్తేనే పర్యావరణానికి రక్షణ

వన్యప్రాణి వారోత్సవంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

**అమరావతి, అక్టోబరు 7 (మనం న్యూస్) :** పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణపై ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలని డిప్యూటీ సీఎం, అటవీ శాఖ మంత్రి పవన్కల్యాణ్ అన్నారు. సోమవారం మంగళగిరిలోని అరణ్యభవన్లో నిర్వహించిన 70 వ వన్యప్రాణి వారోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సముద్ర జీవ సాక్ష్యం అనే యాప్ను పవన్ ప్రా రంభించారు. అనంతరం మాట్లాడుతూ.. 'వసుధైక కుటుంబంలో సమస్త జీవ రాశికీ చోటుంది. ఇందులో మనిషి ఒకడు. విజ్ఞానం, పరిజ్ఞానం, సాంకేతికతతో ఇతర జీవరాశుల కంటే మనం ఉన్నత దశలో ఉన్నాం. మనపై ఆధారపడిన, మనతో పాటు జీవించే ఇతర జీవులన్నింటినీ రక్షించుకుంటేనే మానవ మనుగడ సా ధ్యం. వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు ఇవే చెప్తున్నాయి. ఇతర జీవాల మనుగడపై మనిషి ఉనికి ఆధారపడి ఉందని గుర్తించాలి. నల్లమలలో చెంచులు వన్యప్రాణులను దేవుళ్లుగా భావిస్తారు. పెద్దపులిని పెద్దమ్మగా, ఎలుగుబంటిని లింగమయ్యగా, – మిగతా 2లో...



## హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టండి

కేంద్రానికి మంత్రి సత్యకుమార్ లేఖ

**అమరావతి, అక్టోబర్ 7 (మనం న్యూస్):** సత్యసాయి జిల్లా ధర్మవరంలో 'హ్యాండ్లూమ్ క్లస్టర్' ఏర్పాటుకు సత్వరం చర్యలు చేపట్టాలని కేంద్ర జౌళి, చేనేత శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు ఏపీ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ లేఖ రాశారు. శతాబ్దాలుగా చేనేత రంగానికి ముఖ్యంగా – మిగతా 2లో...

## గరుడవాహన సేవకు చెన్నై గొడుగులు

టిటిడికి అందచేసిన హిందూ ధర్మార్థ సమితి

ఆధ్యాత్మిక పుస్తకాలు ఆవిష్కరించిన ఇవో

అలరించిన కల్పవృక్షవాహన సేవ



**తిరుమల, అక్టోబర్ 7 (మనం న్యూస్):** శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడసేవనాడు స్వామి వారికి అలంకరించేందుకు హిందూ ధర్మార్థ సమితి చెన్నై నుండి తొమ్మిది గొడుగులు, రెండు పెరుమాళ్ నామాలను ఊరేగింపుగా సోమవారం తిరుమలకు తీసుకొచ్చింది. సమితి ట్రస్టీ శ్రీ ఆర్.ఆర్.గోపాల్‌జి ఆధ్వర్యంలో తిరుమలకు చేరుకున్న గొడుగులకు టీటీడీ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయం ముందు ఈ గొడుగులను టీటీడీ ఈవో శ్రీ జె.శ్యామలరావు, – మిగతా 2లో...

## 800మంది ప్రత్యేక పోలీసు అధికారులను కేటాయించండి

తీవ్రవాద కార్యకలాపాల నిర్మూలనకు సహకరించండి

కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు హోం మంత్రి అనిత వినతి



**న్యూఢిల్లీ, అక్టోబరు 7 (మనం న్యూస్) :** ఆంధ్రప్రదేశ్లో వామపక్ష తీవ్రవాద కార్యకలాపాల నిర్మూలనకు భద్రతా సంబంధ వ్యయం పథకం కింద 800 మంది ప్రత్యేక పోలీసు అధికారులను కేటాయించాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత.. కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు విజ్ఞప్తి చేశారు. సోమవారం దిల్లీలో కేంద్ర హోం మంత్రి ఆధ్వర్యంలో జరిగిన నక్సల్ ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రుల సదస్సులో ఆమె ఈ మేరకు ప్రత్యేక విజ్ఞాపన చేశారు. వామపక్ష ప్రభావం అధికంగా ఉన్న ఖమ్మం, విశాఖపట్నం, – మిగతా 2లో...

# ‘హ్యాండ్లూమ్ క్లస్టర్’ ఏర్పాటుకు చర్యలు చేపట్టండి

మొదటి పేజీతరువాయి...

పట్టుచీరెల ఉత్పత్తికి ఈ ప్రాంతం ప్రసిద్ధి గాంచిందని మంత్రి లేఖలో పేర్కొన్నారు. హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక( డిపిఆర్)ను లేఖ కు జత చేసినట్లు మంత్రి తెలిపారు. దాన్ని పరిశీలించి చర్యలు చేపట్టాలని ఆయన కేంద్ర మంత్రిని కోరారు. అత్యుత్తమ నాణ్యతతో కూడిన చేనేత, పట్టు చీరెల తయారీ నిపుణులకు ధర్మవరం పుట్టినిల్లని సత్యకుమార్ లేఖలో వివరించారు. ఆధునిక యాంత్రిక యుగంలో పవర్లూమ్స్ విపరీతంగా పెరిగిపోతుండటంతో ధర్మవరం సంప్రదాయ పట్టు చీరెల తయారీ రంగం అనేక సవాళ్లు ఎదుర్కొంటోందని మంత్రి తెలిపారు. దీంతో ఈ రంగం పై ఆధారపడిన వారి ఆదాయం గణనీయంగా తగ్గిపోతూ ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకు పోతున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. సవాళ్ల ఊబిలో చిక్కుకున్న ధర్మవరం చేనే త, పట్టు చీరెల ఉత్పత్తి రంగాన్ని గాడిలో పెట్టేందుకు తాను పంపుతున్న డీపీఆర్‌లో పలు ప్రతిపాదనలు చేసినట్లు కేంద్ర మంత్రికి సత్యకుమార్ తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్‌లోని సత్యసాయి జిల్లావ్యాప్తంగా దాదాపు 28,500కుటుంబాలు, ప్రత్యేకంగా ధర్మవరం ప్రా ంతంలో 12,800 కుటుంబాలు చేనేత రంగంపై ఆధారపడి మనుగడ సాగిస్తున్నాయని మంత్రి చెప్పారు. అందువల్ల చేనేత కార్మికుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందు కు, ఈ రంగంలో తగిన పోటీ తత్వాన్ని ప్రోత్సహించేం దుకు తాను ప్రతిపాదించిన చర్యలు ఉపయోగపడతాయని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. దాదాపు రూ.30కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదిస్తున్న ధర్మవరం హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటులో 80శాతం మేర నిధులు (సుమారు రూ.24కోట్లు) కేంద్రం భరిస్తే, మిగిలిన 20 శాతం నిధులు రూ.6కోట్లను ఏపీ ప్రభుత్వం భరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు లేఖలో వివరించారు. హ్యాండ్లూమ్ క్లస్టర్‌తో అనేక ప్రయోజనాలు, ఎన్నో కుటుంబాలు ఆధారపడే అవకాశం ఉన్నందున డీపీఆర్‌ను పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టాలని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్‌కు మంత్రి సత్యకుమార్ యాదవ్ విజ్ఞప్తి చేశారు.

# స్వర్ణాంధ్ర @2047 సాకారానికి సహకరించండి

మొదటి పేజీతరువాయి...

**న్యూఢిల్లీ, అక్టోబరు 7 (మనం న్యూస్):** వికసిత భారత్ లక్ష్యంలో భాగంగా 2047 నాటికి స్వర్ణాంధ్రను సాధించేలా కేంద్రం మద్దతివ్వాలని ప్రధాని మోదీకి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ‘స్వర్ణాంధ్ర విజన్’ సాకారానికి సంపూర్ణంగా సహకరించాలని కోరారు. సోమవారమిక్కడ ప్రధాని నివాసంలో సీఎం చంద్రబాబు ఆయనతో సుమారు గంట పాటు చర్చించారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై కీలక చర్చలు జరిపారు. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్కు డిసెంబరులో శంకుస్థాపన సేందుకు రావలసిందిగా ఇదే సందర్భంగా అభ్యర్థించినట్లు తెలిసింది. అలాగే ఇటీవల భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమైన ఏపీకి మరిన్ని నిధులిచ్చి ఆదుకోవాలని కోరారు. బుడమేరు వరదలపై కేంద్ర బృందం నివేదిక ఇచ్చిన తర్వాత ప్రధానితో ముఖ్యమంత్రి భేటీ కావడం ఇదే మొదటిసారి. అలాగే పోలవరం ప్రాజెక్టు పనులు తిరిగి ప్రారంభించా లని, మరో సీజన్ నష్టపోకుండా వరద తగ్గుముఖం పట్టగానే నవంబర్లోనే కొత్త డయా ఫ్రంవాల్ పనులు ప్రారంభించి.. వేసవి కల్లా పూర్తిచేసేందుకు నిధులిచ్చి సహకరించాల ని ప్రధానికి విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. ‘రాష్ట్రాభివృద్ధికి ఎంతో కీలకమైన జాతీయ రహదారుల ప్రాజెక్టులను కేటాయించాలి. ప్రధానమంత్రి ఉజ్వల్ యోజనను రాష్ట్రంలో విస్తృతంగా అమలు చేయాలి. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న 60లక్షల మందికి లబ్ధి చేకూర్చాలి. రాజధాని అమరావతిలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు వేగంగా పూర్తయ్యేలా సహకరించాలి’ అని కోరారు. మోదీతో సమావేశం ముగిసిన వెంటనే చంద్రబాబు తన అధికార నివాసానికి వెళ్లిపోయారు. అక్కడ రైల్వే, ఎలక్ట్రానిక్స్-ఐటీ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్తో భేటీ అయ్యారు. కేంద్ర ప్రాజెక్టులకు పెండింగ్ నిధుల మంజూరు, విశాఖ రైల్వే జోన్ పురోగతిపైనా చర్చించినట్లు తెలుస్తోంది. రాజధానికి అనుసంధానించే రైల్వే ప్రాజెక్టుల గురించి, రాష్ట్రంలోని పోర్టుల అభివృద్ధి, అనుసంధానంపైనా కేంద్ర మంత్రితో భేటీలో చంద్రబాబు వివరించినట్లు సమాచారం. వీరిద్దరితో భేటీల వివరాలను ఆ తర్వాత సీఎం ‘ఎక్స్’లో పంచుకున్నారు. ప్రధానితో చర్చలు ఫలవంతంగా జరిగాయన్నారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి సవరించిన వ్యయ అంచనాలకు కేబినెట్ ఆమోదం తెలిపినందుకు కృతజ్ఞతలు తెలిపానన్నారు. రాష్ట్రంలో వివిధ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో రైల్వే శాఖ రూ.73,743 కోట్ల పెట్టుబడులు పెడుతున్నట్లు మంత్రి వైష్ణవ్ తెలిపారని చెప్పారు. ఏపీలోని హౌరా-చెన్నై మార్గాన్ని నాలుగు లైన్లుగా మార్చడం, 73 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ, మరిన్ని లోకల్ రైళ్లను ప్రవేశపెట్టడం



వంటివి ఈ ప్రాజెక్టుల్లో ఉన్నాయని తెలిపారు. పెండింగ్లో ఉన్న రైల్వే జోన్ హామీని ముందుకు తీసుకెళ్లినందుకు కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు చెప్పారు. రాష్ట్రంలో లాజిస్టిక్, కమ్యూటర్ మౌలిక వసతుల బలోపేతానికి రైల్వేతో కలిసి పనిచేయడానికి ఎదురు చూస్తున్నామని సీఎం తెలిపారు.

## నేడూ కేంద్ర మంత్రులతో చర్చలు

మంగళవారం కూడా ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులతో సీఎం చర్చలు జరుపనున్నారు. ఉదయం 11.30 గంటలకు ఉపరితల రవాణా మంత్రి నితిన్ గడ్కరీని కలుస్తారు. అమరావతి ఔటర్ రింగ్రోడ్డు, జాతీయ రహదారుల అభివృద్ధికి నిధులు కోరతారు. సాయంత్రం వాణిజ్యం-పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్, పట్టణాభివృద్ధి మంత్రి హర్దీప్‌సింగ్ పురీతో సమావేశమవుతారు. రాత్రి 8 గంటలకు హోంమంత్రి అమిత్ షాతో, రాత్రి 11 గంటలకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్తోనూ చర్చలు జరుపుతారు.

## ఎంపీల పనితీరు సమీక్షిస్తా..

సోమవారం రాత్రి టీడీపీ ఎంపీలతో చంద్రబాబు సమావేశమయ్యారు. ప్రతి ఎంపీ పనితీరును సమీక్షిస్తానని చెప్పారు. నియోజకవర్గానికి చేసిన పనులు, పార్లమెంటులో పనితీరు, కేంద్ర నుంచి నిధులు తీసుకురావడంపై వారి పనితీరుకు గ్రేడింగ్ ఇస్తానని తెలిపారు.

# తిరుమలలో వైభవంగా బ్రహ్మోత్సవాలు


మొదటి పేజీతరువాయి...

స్వామివారు తిరుమల మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కల్పవృక్ష వాహనంపై శ్రీవారి వైభవాన్ని తిలకించి భక్తులు పులకించిపోయారు. రాత్రి స్వామివారికి సర్వభూపాల వాహనసేవ జరగనుంది. మరోవైపు బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుమలకు భక్తులు పోటెత్తుతున్నారు. దీంతో గోవిందనామ స్మరణతో సప్తగిరులు మార్మోగుతున్నాయి. భక్తులు వాహన సేవలను తిలకించి భక్తిపారవశ్యంలో మునిగి తేలుతున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తిరువీధులు భక్తులతో నిండిపోయి. గోవింత నామ స్మరణలతో మారుమోగుతున్నాయి. తిరుమల శ్రీనివాసుని నవరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మరోవైపు శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో వివిధ కళాకారుల సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రధానంగా.. శ్రీవారికి ఘనంగా నిర్వహించే గరుడ వాహనసేవ మంగళవారం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 11గంటల వరకు జరగనుంది. ఈ గరుడ వాహన సేవ కోసం టీటీడీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. గరుడసేవను తిలకించేందుకు లక్షలాదిగా తరలివచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తిరుపతి జిల్లా పోలీసులు, టీటీడీ భద్రతాధికారులతో కలిసి భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. దానిలో భాగంగా.. నేటి అర్థ రాత్రి నుంచి కనుమ రహదారుల్లో ద్విచక్రవాహనాలను నిషేధించటంతో పాటు, కొండ కింద అలిపిరి దగ్గర వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన గరుడ సేవకు పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని టీటీడీ ఈవో శ్యామలరావు అన్నారు. మాడవీధుల గ్యాలరీ రెండు లక్షల మంది భక్తులు వాహనసేవను తిలకించేందుకు వీలు ఉందని చెప్పారు. క్యూలైన్ల నుంచి మాడవీధుల కూడలికి పెద్దసంఖ్యలో భక్తులు చేరుకునేలా చర్యలు తీసుకున్నామన్నారు. భక్తులకు అన్న ప్రసాదాలు, పాలు, మజ్జిగ నిరంతరాయంగా పంపిణీ చేస్తామని వెల్లడించారు. అలాగే..

గరుడ సేవను తిలకించేందుకు మాడవీధుల్లో బయట ఉన్న భక్తు లకు టీవీ స్క్రీన్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. శ్రీవారి గరుడ సేవకు పటిష్ట బందో బస్తు ఏర్పాట్లు చేశామని తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు తెలిపారు. ఐదు వేల మంది పోలీసు బలగాలతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గరుడ సేవ రోజున మూడున్నర లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేసినట్లు చెప్పారు. సీసీ కెమెరా నిఘాలో తిరుమల మొత్తం మానిటరింగ్ చేస్తామన్నారు. మరోవైపు.. తిరుమలలో ఎనిమిది వేల వాహనాలకు మాత్రమే పార్కింగ్ సదుపాయం ఉందని, మిగతా వాహనాలను తిరుపతిలో ఏర్పాటు చేసిన ఐదు హోల్డింగ్స్ పాయింట్స్‌లో పార్కింగ్ చేసుకొని.. అక్కడి నుంచి ఆర్టీసీ బస్సుల ద్వారా తిరుమలకు రావాలని ఎస్పీ సుబ్బారాయుడు సూచించారు.

# ఎన్‌హెచ్-30 నాణ్యత లోపాలు.. వందల ప్రశ్నలు

- 326 కోట్ల ప్రాజెక్ట్ లో తప్పుడు ప్రణాళికలు
- కాంట్రాక్టర్ అవకతవకలు




**చింతూరు,అక్టోబర్ 07(మనం న్యూస్):** సుమారు 65 కిలోమీటర్ల ఎన్ హెచ్ -30 మార్గం కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 326 కోట్ల రూపాయల నిధులను కేటాయించింది. ప్రతీ కిలోమీటర్‌కు సుమారుగా ఐదు కోట్ల రూపాయల ఖర్చుతో, జాతీయ రహదారుల సంస్థ ఆధునీకరించాల్సిన ఈ రహదారి ప్రాజెక్ట్‌లో, అవసరానికి తగిన విధంగా చేయకపోవడం వల్ల రహదారి వరద ముంపునకు గురవుతుందనే విషయం ముందే స్పష్టమైంది. ప్రణాళికా పత్రం (డిపిఆర్) సరైన పద్ధతిలో ఆమోదం పొందకపోవడం వల్ల ప్రభుత్వ నిధులు వృథాగా పోతున్నాయని పలువురు నిపుణులు పేర్కొన్నారు.

## జాతీయ రహదారి -30 నిర్మాణంలో నియమ నిబంధనలు పాటిస్తున్నారా..?


జాతీయ రహదారి నిర్మాణం జి ఎస్ బి, వెట్ మిక్స్, బి ఎం మ్, ఎస్ టి బి సి, డిపిఆర్ లో పొందుపరిచిన నాణ్యమైన ఇసుక, అలాగే తగినంత నీటిని వాడుతున్నట్లు లేదనీ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## - సాయిల్ టెస్ట్ చేశారా..?

సాయిల్ టెస్ట్ చేశారా అని పలువురు నిపుణులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానమైన అంశం రహదారిని నిర్మిస్తున్న సమయంలో నాలుగు కిలోమీటర్ల రోడ్డు పూర్తి అయిన తర్వాతే మరో నాలుగు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం చేపట్టాలి. అలా జరుగుతుందా అని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. తగిన ప్రమాద సూచిక బోర్డు లు లేక రోడ్డు యాక్సిడెంట్లు జరుగుతున్నాయి. వాహనదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు.

## - గోదావరి ముప్పును ఎందుకు పరిగణలోకి తీసుకోలేదు..?

కొద్దిపాటి వరదలకు జాతీయ రహదారి చట్టి కూనవరం జంక్షన్ వద్ద నీట మునిగి, రోజుల కొలది వాహనాలు వందల సంఖ్యలో బారులు తీరిన ఘటనలను రాష్ట్ర ప్రజలకు, ప్రభుత్వానికి సుపరిచితం. డ్రైవర్లకు తిండి లేక చిత్రవధ అనుభవిస్తున్న సమయంలో స్వచ్ఛంద సేవ సంస్థలు, పోలీస్ వారి సహకారం వారికి భోజన సదుపాయాలు కల్పించిన దృశ్యాలు మన కళ్ళ ముందు ఇంకా మెదులుతూనే ఉన్నాయి. తెలంగాణ భద్రాచలం నుండి ఒడిశా, చతిస్గఢ్ రాష్ట్రాలకు ప్రధాన మార్గమైన నేషనల్ హైవే- 30 ఆధునీకరణ పనులలో అదే రోడ్డుని పునర్ వినియోగించుకోటానికి కిలోమీటర్ కు రూ. 5 కోట్లు చొప్పున ఖర్చు పెడుతున్నట్లు సమాచారం. అలాంటప్పుడు గోదావరి పోటు లేని ప్రదేశం నుండి రహదారులు నిర్మించవచ్చు కదా అనే ప్రశ్నలు వస్తున్నాయి. ఉదాహరణకు చట్టి నుండి రెడ్ క్రాస్ బిల్డింగ్ వెనక నుండి సింగన్నగూడెం వరకు రోడ్డుని ఆధునికరించినట్లయితే వరదల సమయంలో గానీ అలాగే పోలవరం ఎంత ఎత్తు పెంచిన ఆ రహదారి ముంపున కు గురవదని ఇక్కడున్న ప్రజలు ప్రజాప్రతినిధులకు అందరికి తెలిసిన విషయమే. ఇదే ప్రధాన ఆరోపణ. కేంద్ర అనుమతులు అన్నీ ఉన్నా ఈ రోడ్డు మీద దృష్టి ఎందుకు పెట్టలేదని పాయం వెంకయ్య ప్రశ్నల వర్షం కురిపించారు. అలాగే లక్ష్మీపురం నుండి నెల్లిపాక భద్రాచలం రోడ్డు కూడా చాలా చోట్ల ముంపునకు




గురవుతుంది. మళ్ళీ అదే రోడ్డుని ఆధునికరిస్తున్నారు. దానికి కూడా ప్రత్యామ్నాయ రోడ్డు వరదల సమయంలో ఉపయోగిస్తున్న రోడ్డుని అనగా లక్ష్మీపురం, మారాయిగూడ జంక్షన్ మీదుగా భద్రాచలం ఐటిడిఏ మీదుగా భద్రాచలం కు ఇప్పటికీ వరదల సమయంలో వినియోగించడం జరుగుతుంది. మరి ఈ రహదారిని ఎందుకో పరిగణలోకి తీసుకోలేదని ప్రశ్న తలెత్తుతుంది. ఎందుకు ఆ మార్గాన్ని అభివృద్ధి చేయట్లేదు అనేది మరో ప్రశ్న. రహదారుల సంస్థ వద్ద సరైన ఇంజనీర్లు లేరా? ఎందుకు లోప భూఇష్టమైన డిపిఆర్ని ఆమోదించారు. అందుకే సమగ్ర విచారణ జరిపి ప్రజా ధనాన్ని దుర్వినియోగం కాకుండా దీన్ని ఆమోదించిన అధికారులపై చర్యలు తీసుకునేలా చూస్తామని వెంటనే జాతీయ రహదారుల సంస్థకు బిజెపి రాష్ట్ర అధ్యక్షులకు నితిన్ గట్కరి కి మెమొరాండం ఇస్తామని దీనిపై విచారణ జరపాలని బిజెపి నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ విషయాలను పరిగణలోకి తీసుకొని శాటిలైట్ వ్యూ సర్వేని నిర్వహించి చిడుమూరు, చట్టి, రెడ్ క్రాస్ బిల్డింగ్, సింగన్నగూడెం, భద్రాచలం ఐటిడిఏ రోడ్డును ప్రజలు ఉపయోగిస్తున్న రహదారిని ఆధునీకరించడం ద్వారా వరద ముప్పును నివారించవచ్చు. దీంతో ప్రజా ప్రయోజనాలకు చేకూర్చిన వారు అవుతారని అని పలువురు నిపుణులు సూచిస్తున్నారు.

## - నాణ్యతలో లోపాలు :

రహదారి పనుల్లో నాసిరకమైన మట్టిని ఎక్కువగా వినియోగిస్తున్నారని, అనుమతుల్లోని మట్టి క్వారీలకు యజమానులకు , పంచాయతీ కి పన్నులు కడుతున్నారా, అనే ప్రశ్నలు ఉత్పన్నం చేశారు.

## - ఈ మట్టి క్వారీలకు ఎవరు అనుమతులు ఇచ్చారు..?

ఈ మట్టి క్వారీలకు ఎవరు అనుమతులు ఇచ్చారు. ఈ మట్టిని వాడడం రహదారిపై ప్రభావం ఎలాంటి చూపిస్తుంది ? అధికారులు తక్షణమే ఈ వివరాలను పరిగణలోకి తీసుకోవాల్సి ఉంది. ఇది రహదారి గుణాత్మకతను ప్రభావితం చేస్తుందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కిలోమీటరుకు ఐదు కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మాణం జరుగుతుంటే, నాణ్యతపై ఎందుకు శ్రద్ధ తీసుకోలేదనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సంబందిత ఏఈ ,డి ఈ, ఎస్ ఇ లు పర్యవేక్షణ లేదు అనే అనుమానాలు ఉన్నాయన్నారు.

## - సమగ్ర విచారణకు డిమాండ్

అల్లూరి సీతారామరాజు జిల్లా, చతిస్గడ్ నుండి తెలంగాణ బోర్డర్ వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి (ఎన్ హెచ్ 30) పనుల్లో అనేక అవకతవకలు చోటు చేసుకున్నాయని బీజేపీ జిల్లా సెక్రటరీ పాయం



వెంకయ్య ఆరోపించారు. ప్రస్తుత వరదల సమయంలో రహదారి ముంపు సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ, కాంట్రాక్టర్లు సరైన ప్రణాళికా పద్ధతులను పాటించకుండా పనులు చేస్తున్నారని తెలిపారు. - రహదారి నిర్మాణంలో జరిగిన అవకతవకలు, నాణ్యతలో లోపాలు, అధికారులు ఎన్నిసార్లు ఈ రహదారిని పరీక్షించి ఏ రోజుకు ఆ రోజే ఆమోదం తెలపాల్సిన అవసరం ఉంది కానీ ఎందుకు అధికారులు ఈ విషయాలను పరిగణలోకి తీసుకోలేదు, తప్పుడు ప్రణాళికలు వంటి అంశాలపై సమగ్ర విచారణ జరపాలని, డిపిఆర్‌ను సవరించి ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కాకుండా న్యాయం చేయాలని బీజేపీ జిల్లా సెక్రటరీ పాయం వెంకయ్య బిజెపి చింతూరు మండల అధ్యక్షుడు డివిఎస్ రమణారెడ్డి డిమాండ్ చేశారు. ఇదే విధంగా లోపభూహిష్ఠమైన పనులు నిర్వహిస్తే తప్పక ఎన్ హెచ్ రహదారిపై బైఠాయిస్తామని ప్రజలకు నష్టం చేకూర్చే ఏ పనినైనా హర్షించమని వెంటనే ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# వన్యప్రాణుల రక్షణ మన బాధ్యత

మొదటి పేజీతరువాయి...



అడవి పందిని బంగారు మైసమ్మగా, రేసుకుక్కను బవరమ్మగా కొలుస్తారు. పురాణాల్లో సైతం మత్స్యావతారం, కూర్మావతారం, వరాహావతారాలకు విశిష్టత ఉంది. అందువల్ల వన్యప్రాణులకు విలువ ఇవ్వాలి’ అని అన్నారు. ప్లాస్టిక్ వాడాన్ని క్రమం గా తగ్గించి, మొక్కల పెంపకం, వన్యప్రాణుల సంరక్షణ మనిషి రోజువారీ జీవన విధానంలో భాగం కావాలని పవన్ కోరారు. అటవీ శాఖ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ను డిప్యూటీ సీఎం పవన్ ప్రారంభించారు. పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి, అటవీశాఖ అధికారులు నాయక్, ఖజారియా, శ్రీధర్, రేవతి, రాహుల్ పాండే, శాంతిప్రియా పాల్గొన్నారు.

# 800 మంది ప్రత్యేక పోలీసు అధికారులను కేటాయించండి

మొదటి పేజీతరువాయి...

తూర్పుగోదావరి జిల్లాల్లో అదనపు మానవవనరులను మోహరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రత్యేక పోలీసు అధికారుల గౌరవ వేతనానికి సంబంధించి రాష్ట్రానికి రావాల్సిన రూ. 25.69 కోట్లు తిరిగి చెల్లించాలని కోరారు. గత ఏడాది జూన్లో వివిధ పనుల కోసం రాష్ట్రం నుంచి తరలించిన 5 కంపెనీల సీఆర్పీఎఫ్ బలగాలను తిరిగి పంపాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 17 కంపెనీల సీఆర్పీఎఫ్ బలగాలే అందుబాటులో ఉన్నాయని, దీనివల్ల నక్సల్ నిర్మూలన కార్యకలాపాలకు ఇబ్బందిగా మారే అవకాశం ఉందని వివరించారు. రాష్ట్రంలో తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలకు కేటాయించిన 346 మొబైల్ టవర్లలో ఇంకా 53 టవర్ల పనులు ప్రారంభించాల్సి ఉందని, వాటిని త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ప్రాంతాల్లో 1,455 కిలోమీటర్ల రహదారులు, వంతెనల నిర్మాణం కోసం పంపిన ప్రతిపాదనలకు వెంటనే ఆమోదం తెలిపి నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కొత్తవలస మండలం రెల్లి వద్ద గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రం ఏర్పాటు కోసం 526 ఎకరాల భూమి గుర్తించామని, ఆ ప్రాజెక్టుకు త్వరగా అనుమతివ్వాలని కోరారు. రాష్ట్రంలో మాదక ద్రవ్యాల అక్రమరవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో యాంటీ నార్కొటిక్స్ టాస్కోర్స్ ఏర్పాటు చేస్తున్న విషయాన్ని అనిత.. కేంద్ర హోం మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దాని సామర్థ్య నిర్మాణం, ఇతర రాష్ట్రాలతో కలిసి సంయుక్త టాస్కోర్స్ ఏర్పాటుకు కేంద్రం నుంచి సహాయసహకారాలు అందించాలని కోరారు. దీనివల్ల రాష్ట్రంలో గంజాయి సమస్యను అరికట్టడంతోపాటు, నక్సలైట్లకు ఆర్థిక వనరులు సమకూర్చేవారి కార్యకలాపాలు అరికట్టేందుకూ వీలవుతుందని అమిత్షాకు వివరించారు. సీఎస్ నీరబ్కుమార్‌ప్రసాద్, డీజీపీ ద్వారకాతిరుమలరావు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# గరుడవాహన సేవకు చెన్నై గొడుగులు


మొదటి పేజీతరువాయి...

అదనపు ఈవో శ్రీ సిహెచ్ వెంకయ్య అందుకున్నారు. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన సోమవారం ఉదయం కల్పవృక్ష వాహనసేవలో నాలుగు ఆధ్యాత్మిక పుస్తకాలను టిటిడి ఈవో శ్రీ జె.శ్యామలరావు, అదనపు ఈవో శ్రీ సిహెచ్ వెంకటయ్య చౌదరితో కలిసి ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన సోమవారం ఉదయం శ్రీమలయప్ప స్వామివారు ఉభయదేవేరులతో కలిసి వేణుగోపాలస్వామి అలంకారంలో కల్పవృక్ష వాహనంపై భక్తులకు అభయమిచ్చారు. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాలు భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల ఘోష్టితో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయి ద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి శ్రీవారిని దర్శించుకున్నారు. క్షీరసాగరమథనంలో విలువైన వస్తువులెన్నో ఉద్భవించాయి. వాటిలో కల్పవృక్షం ఒకటి. ఈ చెట్టు నీడన చేరిన వారికి ఆకలిదప్పులుండవు. పూర్వజన్మస్మరణ కూడా కలుగుతుంది. ఇతర వృక్షాలు తాము కాచిన ఫలాలు మాత్రమే ప్రసాదిస్తాయి. అలాకాక కల్పవృక్షం కోరుకున్న ఫలాలన్నింటినీ ప్రసాదిస్తుంది. అటువంటి కల్పవృక్ష వాహనాన్ని అధిరోహించి నాలుగో రోజు ఉదయం శ్రీవారు దర్శనమిచ్చారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు సర్వభూపాల వాహనంపై స్వామివారు అభయమిచ్చారు. వాహనసేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీ శ్రీ చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఈవో శ్రీ జె.శ్యామలరావు, అదనపు ఈవో శ్రీ సిహెచ్ వెంకటయ్య చౌదరి, జెఈవోలు శ్రీమతి గౌతమి, శ్రీ వీరబ్రహ్మం ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రైల్వే శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా రమేష్ బాధ్యతల స్వీకరణ

- బాధ్యతలు స్వీకరించిన పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్

**విశాఖపట్నం,అక్టోబర్ 07(మనం న్యూస్) :** ఢిల్లీ లో అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీ.ఎం రమేష్ రైల్వే శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ముందుగా లోక్సభ స్పీకర్ ఓం బిర్లా ని మర్యాదపూర్వకంగా కలిసి వారిని దుశ్శలువతో సత్కరించారు. కీలకమైన రైల్వే శాఖకు చైర్మన్గా ఉన్నతమైన బాధ్యతను అందించినందుకుగాను ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం పార్లమెంట్ భవనం మీటింగ్ హాల్ లో ఏర్పాటు చేసిన రైల్వే శాఖ కమిటీ మొదటి సమావేశం లో కమిటీ సభ్యులుగా ఎన్నికైన పార్లమెంట్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.



పరిచయ కార్యక్రమం అనంతరం మొదటిసారిగా ఏర్పాటైన కమిటీ సమావేశంలో 2024-25 వార్షిక సంవత్సరంలో రైల్వేలో చేపట్టబోయే పలు అభివృద్ధి కార్యక్రమాలు గురించి సుదీర్ఘంగా చర్చించారు.

# మన వైభవాన్ని చాటి చెప్పే విధంగా విజయనగరం ఉత్సవాలు

- ఉత్సవ వేదికలను, సిరిమాను తయారీని పరిశీలించిన మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు





**విజయనగరం, అక్టోబర్ 07(మనం న్యూస్) :** విజయనగరం వైభవాన్ని, సంస్కృతిని చాటి చెప్పే విధంగా ఉత్సవాలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర ఎం ఎస్ ఎం ఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు చెప్పారు. ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, జాయింట్ కలెక్టర్ ఎస్. సేతు మాధవన్ తో కలిసి సోమవారం పట్టణంలోని ఉత్సవ వేదికలను పరిశీలించారు.మంత్రి ముందుగా శ్రీ పైడితల్లి అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. ఆయనకు ఆలయ పూజారులు అధికారుల లాంచనాలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ ప్రాంగణాన్ని, క్యూ లైన్లను మంత్రి పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అనంతరం హుకుంపేట వెళ్లారు. అక్కడ సినిమాను తయారీని మంత్రి పరిశీలించారు. పూజరులుతో చర్చించారు. సిరిమానుని అమ్మవారి ఆలయం దగ్గరికి వీలైనంత వేగంగా తరలించాలని మంత్రి కోరారు. ఇరుసుమాను, రథాలను కూడా మంత్రి పరిశీలించారు. అనంతరం మెగా ఈవెంట్ జరిగే అయోధ్య మైదానానికి మంత్రి చేరుకున్నారు. 13,14 తేదీల్లో రెండు రోజులపాటు నిర్వహించే మెగా ఈవెంట్ పై, సంబంధిత వేదికల ఇన్చార్జిలతో చర్చించారు. ఈవెంట్ కు భారీ ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు.

**- వైభవాన్ని చాటిచెబుతాం.. మంత్రి కొండపల్లి**

ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ మన జిల్లా వైభవాన్ని చాటిచెప్పేవిధంగా విజయనగరం ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. సిరిమానోత్సవానికి సంబంధించి భక్తులకు ఎటువం టి ఇబ్బందులు రాకుండా పక్కా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. అమ్మవారి పండుగకు లక్షలాది మంది భక్తులు విజయనగరం చేరుకుంటారని, వారు ఎటువంటి ఇబ్బంది పడకుండా చూస్తామని అన్నారు. పోలీసులు సోదరభావంతో మెలిగి, భక్తులకు సహకారం అందించాలని కోరారు. భక్తులతో అనుచితంగా ప్రవర్తించ వద్దని సూచించారు. అలాగే ఈ ఏడాది సిరిమాను ఉత్సవంలో వివిద మార్గాల ద్వారా సేవలందించేందుకు ఆయా కమిటీల సభ్యులకు టీ షర్టులను కేటాయించనునట్లు తెలిపారు. ఉత్సవాలు, సిరిమానోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ సంస్కృతిక కార్యక్రమాలు, పుష్ప ప్రదర్శన, లేజర్ షో, పెట్ షో, స్థానిక కళకారులతో ఏర్పాటు చేసిన గ్రామీణ జానపద కళలు ఎంతోగానో ఆకట్లు కుంటాయని తెలిపారు. ఉత్సవాలకు సంభందించి 13 వతేదీన భారీఎత్తున ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. 14 వ తేదీన యువత, పేక్షకులు మెచ్చేవిధంగా మెగా ఈవెంట్ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సిరిమాను ఉత్సవానికి రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆహ్వానించామని మంత్రి తెలిపారు.

**- ఉచిత దర్శనాలు : ఎంఎల్ఏ**

ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మీ గజపతిరాజు మాట్లాడుతూ భక్తులందరూ అమ్మవారిని దర్శించుకునేలా ఈ ఏడాది ఉచిత దర్శన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా రెండురోజుల్లో విఐపీ దర్శనాలకు సంభందించి ఉదయం, సాయంత్రం మాత్రమే తక్కువ సమయంలో విఐపీ దర్శనాలు అయ్యేటట్లు ప్రణాళికలు సిద్ధం చేసామన్నారు. నగరంలో వాహనదారులు ఇబ్బంది కలగకుండా ముఖ్య కూడాళ్లతోపాటు, ఇతర ప్రాంతాల్లో రోడ్డును మరమత్తులు చేపట్టినట్లు తెలిపారు. అంగరంగవైభవంగా నిర్వహించే ఈ ఉత్సవాల్లో ప్రజలంతా ఉత్సవాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ పర్యటనలో జెసి ఎస్.సేతు మాధవన్, డిఆర్ఓ ఎస్డి అనిత, ఉత్సవాల స్పెషల్ ఆఫీసర్ త్రినాధరావు, ఆర్డిఓ డి.కీర్తి, ఈఓ డివివి ప్రసాదరావు, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, డిఆర్డిఏ పిడి కల్యాణచక్రవర్తి, ఆర్ అండ్బి ఎస్ఈ కాంతిమతి, ఏపిఈపిడిసిఎల్ ఎస్ఈ లక్ష్మణరావు, సిపిఓ పి.బాలాజీ, ఎస్సి కార్పొరేషన్ ఈడి సుధారాణి, మెప్మా పిడి శ్రీనివాసరావు, డిఎస్ఓ వెంకటేశ్వర్రావు, ఆలయ పూజారి బంటుపల్లి వెంకటరావు, ఐవిపి రాజు తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ లోపాలను గుర్తించి సరి చేయాలి

- ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి
- టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్

**సూర్యాపేట,అక్టోబర్ 7(మనం ప్రతినిధి) :** జిల్లా వ్యాప్తంగా వివిధ గ్రామాలతో పాటు పట్టణాలలో మిషన్ భగీరథ లోపాలను గుర్తించి వెంటనే సరి చేయాలని దీంతో గ్రామ పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్య కు శాశ్వత పరిష్కారం చూపించినట్లు అవుతుందని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యాపేట నియోజకవర్గ ఇన్చార్జ్ ధర్మార్జున్ అన్నారు. ప్రధానంగా పట్టణంలో నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ జన సమితి పార్టీ నాయకుల తో కలిసి సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాల యంలో జరిగిన ప్రజావాణి దరఖాస్తుల స్వీకరణ భాగంగా జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ పవర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధర్మార్జున్ మాట్లాడుతూ మున్సిపాలిటీ మరియు మిషన్ భగీరథ డిపార్ట్మెంట్ల మధ్య సమన్వయ లోపం మిష న్ భగీరథలో తలెత్తుతున్న వివిధ సాంకేతిక లోపాలతో సూర్యాపేట ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రెండు లేదా మూడు రోజులకు ఒక్కసారి పట్టణంలో మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయుట వల్ల చాలా ఇబ్బందులకు గురి అవు తున్నారని అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా కొన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా పైప్ లైన్లు పలికి నీటి సమస్య ఎదురవుతుందని అన్నారు ముఖ్యంగా పట్టనానికి నీటిని ఇమా మ్ పేట పంఫింగ్ స్టెషన్ నుండి రోజుకు 21 ఎం ఎల్ డి ల లీటర్లనీటిని సరఫరా చేయవ లసి ఉండగా కేవల 16-17 ఎం ఎల్ డి ల నీటిని సరఫరా చేస్తున్నారని దీంతో పట్టణం లొ నీటిసరపరా సజావుగ సరఫరా కావడం లేదన్నారు అదేవిధంగా పట్టణం నం కు మిష న్ భగిరథ వాటర్ పంపింగుకు ప్రత్యామ్నాయ విధానము లేనందున సాగర్ కెనాల్ అడవిదేవుల పల్లీ , చిట్యాల నుండి వొచ్చే వాటెర్ పంపింగ్ లలొ మోటార్లు మరమ్మతులు ఆయిన లేక విద్యుత్ సౌకర్యము అగి పోయిన , లీకేజి ల వల్ల నీటి సరఫరా ఆగిపోతున్నధి వెల్లడించారు. మిషన్ భగీరథ ప్రాజెక్టు నిర్మాణ సమయము లొ తీసుకున్న జనాభా లెక్క లు ప్రకారం 2011 జనాభా నూ అంచనాలోకి తీసుకొని ఆదే ప్రాతి పదికనా నేటికి పంపిఒంగ్ చేస్తున్నారు. ప్రస్తుతము సూర్యాపేట అంచనా జనాభా 1 లక్ష 80 వేల పైన దాటింది.. యిట్టి అంచనాను మిషన్ భగీరథ వారూ2033సంవత్సరానికి చూయించారు.క ఫలితం గా పట్టణంలో నిటి కొరత ఏర్పడుతుంది అన్నారు.ఒక వైపు గాండ్ల చెర్వు నుండి కూడా నీటిని పపంపింగ్ చేస్తూనే మరోవైపు ఇమాంపేట వద్దనే ఉన్న 3 వ మోటర్ నూ వెంటనే వినియోగం లో తెచ్చి పట్టణ ప్రజలకు ప్రతి రోజూ మిషన్ భగిరధ నీటిని అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షులు గట్ల రమా శంకర్, ఎస్సీ సెల్ జిల్లా కరీంనగర్ బచ్చలకూరి గోపి, డివిఎల్ జిల్లా అధ్యక్ష ఉపాధ్య క్షులు కొంచెం చంద్రకాంత్, అనిల్ ,విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షులు బొమ్మగాని విన య్ గౌడ్ ,పట్టణ మైనార్టీ సెల్ కన్వీనర్ ఫరీదొద్దీన్, పట్టణ నాయకులు సతీష్, కిషోర్ ,వ ంశీ ,తదితరులు పాల్గొన్నారు.



## గ్రామస్థాయి పాలన వ్యవస్థ పటిష్టం

**మిర్యాలగూడ, అక్టోబర్ 07 (మనం న్యూస్) :** పల్లె ప్రజలకు ప్రభుత్వ రంగ సేవలను సమర్థవంతంగా అందించి గ్రామీణస్థాయిలో ఆర్థిక పురోగతిని సాధిస్తూ... గ్రామస్థాయి పాలన వ్యవస్థను పటిష్టవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మిరెడ్డి అన్నారు. సోమవారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండల పరి ధిలో లక్ష్మీపురంలో నూతనంగా నిర్మి ంచిన పంచాయతీ భవనాన్ని డీసీసీ ప్రెసిడెంట్ కేతావత్ శంకర్ నాయక్, జిల్లా నాయకులు గాయం ఉపేందర్ రెడ్డి, పాదిల శ్రీనివాస్, తలకొప్పుల సైదులు దేవేందర్ రెడ్డి, సుధాకర్, నరేష్, నాగరాజు ఇతరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామ పంచాయ తీల నిర్వహణపై మరింత ఫోకస్ చేయాలని అధికారులను కోరారు.

## ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

**భువనగిరి, అక్టోబర్ 07(మనం న్యూస్) :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా త్వరిత గతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జెండగే జిల్లా అధికా రులను ఆదేశించారు. సోమవారం నాడు జిల్లా కలెక్టరేట్ సమావేశ మం దిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్ర మంలో వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 39 దరఖాస్తులను స్వీక రించారు. అందులో రెవిన్యూ శాఖ 20, జిల్లా పంచాయతీ అధికారి 7, డి ఇ ఇ హౌసింగ్ 2, జిల్లా ఎంప్లాయి మెంట్ 2, జిల్లా విద్యా అధికారి 2, చేనేత 2, శిశు సంక్షేమ, జిల్లా గ్రామీణ అభివృద్ధి, నీటిపారుదల, జిల్లా పరిషత్ కార్యనిర్వహక నుండి ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కే.గంగాధర్, జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్ షాలోమ్, జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి శోభారాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, కలెక్టరేట్ పరిపాలనాధికారి జగన్మోహన్ ప్రసాద్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రవికుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మోసపూరితమైన మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్

- కాళేశ్వరం నిర్మించడం వల్లనే గంధమల్లకు నీరు వచ్చింది
- కాంగ్రెస్ దుష్టపాలనను అంతం చేస్తూ కేసీఆర్ మళ్ళీ అధికారంలోకి వస్తారు
- మండల పార్టీ అధ్యక్షులు బీసు చందర్ గౌడ్



**ఆత్మకూర్(ఎం), అక్టోబర్ 7 (మనం న్యూస్) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్( ఎం) మండలానికి కేంద్రంలోని బి.ఆర్.ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు బీసు చందర్ గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల ముందు వరకు కాళేశ్వరం కూలిపోయింది అంటూ దుష్ప్రచారం చేసి ప్రజలను మోసపూరితమైన వ్యాఖ్యలతో మోసం చేసి కాంగ్రెస్ అధికారం లోకి వచ్చి నేడు గంధమల్ల రిజర్వాయర్కు మా నాయకుడు నీళ్లు తెచ్చారని గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదం అన్నారు. కాళేశ్వరం కూలిపోయింది లక్ష కోట్ల అవినీతి జరిగింది అని నోటికొచ్చిన అబద్దాలు ప్రచారం చేసిన మీరు నేడు అదే విధానాన్ని అనుసరించడం హేయమని, కాళేశ్వరం కూలీపోయిందని అని ఇప్పుడు అదే కాళేశ్వరం ద్వారా నీరు కొండపోచమ్మకి వస్తున్నాయి అక్కడి నుండి గంధమల్లకు వస్తున్నాయి. ఈ విషయాలేవీ రైతులకు చెప్పకుండా మీ వక్ర బుద్ధిని మరోసారి చూపిస్తున్నారని, ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు నిజాలు చెప్పండి కేవలం కేసీఆర్ కాళేశ్వరం నిర్మించడం వల్లనే గంధమల్లకు నీరు వచ్చాయన్న విషయం చెప్పకపోవడం శోచనీయమని, నిజం దాస్తే దగాదు, గంధ మల్ల, కొండపోచమ్మ రిజర్వాయర్లకు నీరు కాళేశ్వరం నుండి వస్తుందని చెప్పలేకపోవడం మీ కుట్టిలత్వానికి నిదర్శనం అని, ఇప్పటికే 6 గ్యారెంటీ లు అటకెక్కించి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను నిండా మోసం చేసిన మరో మోసపూరిత కుట్రతో ప్రజల ను మోసం చేస్తామంటే సహించేది లేదని, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి తన స్వంత డబ్బులతో మిగిలిన బునాదిగాని పనులను 90 శాతం పూర్తి చేసిందని తెలియజేశారు. ఆలేరు మాజీ శాసనసభ్యులు బూడిద బిక్షమయ్య గౌడ్ నిజాలు మాట్లాడితే కాంగ్రెస్ నాయకులు ఎందుకంత ఉలిక్కి పడుతున్నారని, ఆయన వల్ల నాయకులుగా చెలామణి అవుతున్న ఇప్పటి కొందరు కాంగ్రెస్ నాయకులు ఆయనను విమర్శించే స్థాయి మీది కాదని తెలియజేస్తున్నామని, అబద్దాల పునాదుల పైన రాక్షస పాలన కొనసాగిస్తూ రాష్ట్రాన్ని రావణ కాష్టం చేస్తున్న కాంగ్రెస్ దుష్ట పాలనను అంతం చేస్తూ మళ్ళీ కేసీఆర్ అధికారంలోకి వస్తారని ఈ సందర్భంగా తెలియజేస్తున్నానని అన్నారు.గంధ మల్ల ద్వారా ఏ విధంగా అయితే నీరు ఆలేరు వాగులోకి వదిలారో అదేవిధంగా బస్వాపూర్ ద్వారా రాయిగిర్ చెరువు నింపి బిక్కేరు వాగు లోకి నీరు వదలాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల పార్టీ అధ్యక్షులు బీసు చందర్ గౌడ్, బి ఆర్ ఎస్ జిల్లా నాయకులు యాస ఇంద్రారెడ్డి, జిల్లా నాయకులు కోరే బిక్షపతి , ప్రధాన కార్యదర్శి పంజల వెంకటేష్, మామిడి శ్రీనివాస్ రెడ్డి, చుంచు నాగరాజు, కోరే వెంకన్న, నాది స్వామి గౌడ్, నాతి రాజు, మల్లెల పర్వతాలు, పాశం ప్రభాకర్, సోలిపురం రామ్ రెడ్డి, మజ్జిగ రాంబాబు, నాగుల యాదగిరి, గజ్జల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# వర్గీకరణ తీర్పును అమలుపరచాలి




- నియామకాలు నిలపాలని రేపు నిరసన ర్యాలీలు
- ఎంఎస్పీ ఇంచార్జ్ మచ్చ ఏడుకొండలు

**మిర్యాలగూడ, అక్టోబర్ 07 (మనం న్యూస్) :** ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 9వ తేదీ లోగా అమలుపరచాలని ఎంఎస్పీ మిర్యాలగూడ నియోజకవర్గ ఇంచార్జ్ మచ్చ ఏడు కొండలు డిమాండ్ చేశారు. సోమవారం ఎమ్మార్పీఎస్ నల్గొండ జిల్లా కార్యదర్శి సంద్ర నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ వర్గీకరణ పై మూడు దశాబ్దల సుదీర్ఘ పోరాట ఫలితంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోవడం సరికాదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే విడుదల చేసిన నోటిఫికేషన్ల తో పాటు భవిష్యత్తులో రిలీజ్ చేసే నోటిఫికేషన్లకు వర్గీకరణ ను వర్తింపచేస్తామని ప్రకటించి జాప్యం చేస్తుండటంతో మాదిగ, ఉప కులాల వారికి అన్యాయం జరుగుతుందన్నారు. వర్గీకరణ అమలుపరిచే వరకు నియామకాలు నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 9న జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నిరసన ర్యాలీలు చేపడుతున్నట్లు తెలిపారు. 15 వ తేదీన హైదరాబాద్ లో జరిగే ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని సక్సెస్ చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంఈఎఫ్ జిల్లా నాయకులు చింత మధు మాదిగ, ఎంఎస్పీ నల్గొండ జిల్లా అధికార ప్రతినిధి మదుపు శ్రీనువాస్, విహెచ్ పిఎస్ మిర్యాలగూడ నియోజకవర్గ ఇంచార్జ్ పాల్వాయి సుధాకర్, విహెచ్ పిఎస్ జిల్లా నాయకులు మేక నాగరాజు, చైతన్య, సురేష్, దైదా సురేష్, రావులపాటి శ్రీను, మహాకాళి సురేష్ ఉన్నారు.

## ఇజ్రాయెల్ చేస్తున్న దాడులు ఆపాలి

**కోదాడ,అక్టోబర్ 07(మనం న్యూస్) :** స్థానిక రంగా థియేటర్ చౌరస్తాలో సిపిఐ ఎంఎల్ డెమోక్రసీ ఆధ్వర్యంలో,పాలస్తీనా పై అమెరికా అండతో ఇజ్రాయిల్ జరుపుతున్న యుద్ధానికి వ్యతిరేకంగా నిరసన తెలపడం జరిగింది.ఈ సందర్భంగా అరుణోదయ జిల్లా అధ్యక్షులు ఉదయగిరి పాల్గొని మాట్లాడుతూ అమెరికా దాని మిత్ర దేశాల అండతో ఇజ్రాయిల్ గత సంవత్సర కాలంగా పాలస్తీనా పై అక్కడి ప్రజలపై చేస్తున్న యుద్ధం దుర్మార్గమైనదని తక్షణమే ఈ యుద్ధాన్ని ఆపాలన్నారు.యుద్ధ పిపాసి అమెరికా గతంలో వియత్నాం,ఆఫ్ఘనిస్థాన్,ఇరాక్ లాంటి పేద దేశాల పైనమారణహోమం సాగించి చివరకు భంగపాటుకు గురైనదని అన్నారు.సంవత్సర కాలంగా పాలస్తీనాలో ఇజ్రాయిల్ నరమేధం సృష్టిస్తున్న నోరు మెదపని అమెరికా నేడు ఇజ్రాయిల్ కు మద్దతుగా ఇరాన్ పై గొంతు చించుకుంటుందని అన్నారు.అనేక దేశాల మధ్య తగువులు పెట్టి తమ ఆయుధాలను అమ్ముకునే ద్వందనీతి కలిగినటువంటి అమెరికా సామ్రాజ్యవాద విధానాలను ప్రజలంతా ముక్తకంఠంతో వ్యతిరేకించాలని ప్రపంచ దేశాల పీడిత వర్గం పాలస్తీనాకు మద్దతు తెలియజేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో రైతు కూలి సంఘం నాయకులు అలుగుబెల్లి సత్యనారాయణ రెడ్డి,మద్దెల ప్రతాప్,కామల్ల రవి,మద్దెల వెంకన్న,చరణ్, ప్రభాకర్,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## డీజేల నిషేధంపై, శాంతియుత ర్యాలీ చేపట్టిన డీజే యజమానులు




**కోదాడ,అక్టోబర్ 07(మనం న్యూస్ ) :** కోదాడ, హుజూర్ నగర్,పాలేరు నియోజకవర్గాలలో ఉన్న డీజే యజమానులు కోదాడ పట్టణంలో సోమవారం నిరసన ర్యాలీ చేపట్టారు.ఈ సందర్భంగా కోదాడ డివిజన్ అధ్యక్షుడు అనంతు లింగస్వామి మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలో డీజేలు నిషేధించడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు.దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలోనే డీజేలను నిషేధించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డికి వినతిపత్రం అందజేయడానికి వెళుతుండగా కోదాడ పోలీసులు అడ్డుకోవడం చాలా బాధాకరమని అన్నారు. డీజేలు నిషేధాన్ని వెంటనే ఎత్తివేయాలని,తమ పొట్టకూటి కోసం పక్కన ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లి డీజేలను పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొందని, తెలంగాణ రాష్ట్ర సాధనలో తమ డీజే పాటలతో,తెలంగాణ రాష్ట్ర ప్రజలను చైతన్య పరచామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇకనైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తమను గుర్తించి,డీజేల నిషేధం వెంటనే ఎత్తివేయాలని ఈ సందర్భంగా కోరారు.ఈ కార్యక్రమంలో..గౌరవ అధ్యక్షులు వేణు,ఓంశీను,ఉపాధ్యక్షులు వజీర్,కోశాధికారి బంగారు,తులస,కార్యదర్శి పందు,సిద్ధు,సలహాదారులు జానీ,నరేష్,వివిధ మండలాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు మరియు మూడు వందల మంది డీజే కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నకిలీ పాస్ పుస్తకాల ముఠాపై చర్యలు తీసుకోవాలి



**నల్లగొండ,అక్టోబర్ 07(మనం న్యూస్) :** నకిలీ పాస్ బుక్కులు పోలీస్ అధికారులు చేతులో తీసుకొని కళ్ళతో చూసిన గాని ఎలాంటి చర్య లు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు .ఫేక్ పాస్ పుస్తకాలపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్లు ఆశ్రయిస్తే సంబంధిత వ్యక్తితో పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడి పరిష్కరించుకోండి అంటూ సలహాలు. పెద్దవూర ఎమ్మార్వో నకిలీ పుస్తకాలపై చర్యలు తీసుకోవాలని రిపోర్ట్ ఇచ్చిన చర్యలు శూన్యం.నకిలీ ధరణి పాస్ బుక్కులు తయారుచేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ సి నారాయణ రెడ్డి కు వినతి పత్రం అందజేసిన బాధితులు,బాధితులు వి రామచంద్రయ్య మీడియా సమావేశంలో మాట్లాడుతూ పెద్దవూర మండలం సంగారం గ్రామంలో ఊరే రామచంద్రయ్య తన వ్యవసాయ సర్వే నెంబర్ 133/4 తొమ్మిది ఎకరాల 20 గుంటలు వ్యవసాయ భూమి ఉన్నది. అందులో 7 ఎకరాలు ఇతరులకు విక్రయించడం జరిగింది. పక్కన ఉన్న భూమి యజమాని రామచంద్రయ్య దగ్గర ఎకరం 20 గుంటలు కొనుగోలు చేశారు. తన పాసుబుక్కులో ఎకరం 20 గుంటలకు బదులు, మూడు ఎకరాల 20 గుంటలు చూయిస్తున్నాడు. ఆ భూమి అసలు యజమాని ఆన్లైన్లో ధరణిలో తన పేరు చూయిస్తుంది. ఇతను నకిలీ పాసుబుక్కులో ముద్రించుకొని భూమి నాది అని చెబుతున్నారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మార్వో పరిశీలించి తనది నకిలీ పాస్ పుస్తకం తన మీద కేసు ఫైల్ చేయండి. అని స్థానిక ఎస్సై, సీఐ లెటర్ ద్వారా పంపించారు. కానీ సంబంధిత ఎస్సై సీఐ కాలయాపన చేయడం గమనార్థం.ఈ విషయంపై న్యాయం చేయాలని సంబంధిత బాధితులు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, మరియు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ ని ఆశ్రయించారు.

## అంగన్వాడీ టీచర్ అనుష కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



**నలగొండ,అక్టోబర్ 07( మనం న్యూస్) :** నాగార్జునసాగర్ ఎడమ కాలువలో రావువారిగూడెం అంగన్వాడీ టీచర్ అనూష ప్రమాదశావత్తు పడి మృతి చెందింది. మిర్యాలగూడలోని వారి ఇంటికి వెళ్ళి పరామర్శించిన (మినీ) అంగన్వాడీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఆడెపు వరలక్ష్మి.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రావువారి గూడెం అంగన్వాడీ టీచర్ టి.అనూష కామేపల్లిలో అంగన్వాడి సెంటర్ కు ఇన్చార్జిగా పనిచేస్తూ విధులు నిర్వహిస్తూ తిరిగి వస్తున్న సందర్భంలో ప్రమాదవశాత్తు సాగర్ కాలులో పడి చనిపోయిందన్నారు.ఆమెకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నదని, రావువారిగూడెం అంగన్వాడి సెంటర్లో టీచర్ గా విధులు నిర్వహిస్తూ పై అధికారుల ఆదేశానుసారంగా కామేపల్లి గ్రామంలోని అంగన్వాడి సెంటర్ కు అదనంగా బాధ్యతలు నిర్వహిస్తున్నది.విధి నిర్వహణలో భాగంగా ఈనెల 5వ తేదీన అంగన్వాడి సెంటర్లో బతుకమ్మ సంబరాలు నిర్వహించి తిరిగి రావువారి గూడెం వస్తున్న సందర్భముగా ప్రమాదవశాత్తు సాగర్ కాలలో పడి కొట్టుకుపోయి చనిపోవడం చాలా బాధాకరం అని, ఆమె కుమారునికి, కూతురుకి ప్రభుత్వం బాధ్యత. వహించి వారి చదువులకయ్యే ఖర్చు ప్రభుత్వమే భరించి,పిల్లలను ఆదుకోవాలని కోరారు.వారితో పాటు దామరచర్లమరియు మిర్యాలగూడ ప్రాజక్ట్ కమిటీ మెంబర్లు చంద్రకళ, పద్మ, విజయ, పద్మ వరలక్ష్మి, సాయమ్మ, సరస్వతి, లలిత, సరిత, చైతన్య మరియు (మినీ) అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ఖమ్మం, అక్టోబర్ 7(మనం బ్యూరో):** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు ప్రాధాన్యత ఇచ్చి, త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ లతో కలిసి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.చింతకాని మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన శీలం లక్ష్మి తన భర్త అనారోగ్య కారణంతో మరణించారని, దళిత బంధు యూనిట్ క్రింద 2022 సెప్టెంబర్ లో గొర్రెల షెడ్డు వేశామని, గొర్రెలు ఇప్పటి వరకు రాలేదని, తనకు గొర్రెలు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ,ఎస్సి కార్పొరేషన్ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.రఘునాథపాలెం మండలం వి.వి. పాలేం గ్రామానికి చెందిన కొల్లి ఉపేంద్రయ్య తనకు 2020-21 లో మంజూరు చేసిన ఎస్సి స్వశక్తి యూనిట్ సబ్సిడీ డబ్బులు ఇప్పటి వరకు రాలేదని, ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఈడి ఎస్సి కార్పొరేషన్ కు రాస్తూ అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న మల్టీ పర్పస్ వర్కర్లు తమకు 5 నెలలుగా జీతాలు పెండింగ్ లో ఉన్నాయని, ప్రస్తుతం కొన్ని పంచాయతీలలో రెండు, మరికొన్నిటీలో ఒక నెల జీతం చెల్లిస్తామని చెప్పారని, మా యందు దయతలచి దసరా లోగా అన్ని నెలల జీతాలు చెల్లించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా పంచాయతీ అధికారికి రాస్తూ గ్రామంలోని జనరల్ ఫండ్ వివరాలు పరిశీలించి మల్టీ పర్పస్ వర్కర్ల జీతాలు పూర్తి స్థాయిలో చెల్లింపుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వైరా పట్టణం 10వ వార్డు గండగలపాడు కు చెందిన ఎం. సైదులు, తన భార్య రాజ్యలక్ష్మి పుట్టుకతో దివ్యాంగురాలని, గత 13 ఏండ్లుగా నడుం పడిపోయి మంచెంలో ఉంటుందని, తన భార్యకు సదరం సర్టిఫికెట్ అందించాలని దరఖాస్తు చేసుకోగా, డిపిఎం కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఖమ్మం రూరల్ మండలం పెద్దతండకు చెందిన డి. ఉపేందర్, సాగర్ పంట కాలువ అప్రోచ్ కెనాల్ ద్వారా రైతుల పొలాలకు నీరు అందించే కాలువను ఇష్టం వచ్చినట్లుగా కబ్జా చేశారని, ఈ కాలువకు పునర్జీవం కల్పించి నీరు పడే విధంగా చేయగలరని పెద్దతండా గ్రామ ప్రజలు కోరగా, ఈఈ ఇరిగేషన్ శాఖకు రాస్తూ పరిశీలించి నివేదిక రూపొందించి సమర్పించాలని కలెక్టర్ సూచించారు.అనంతరం జిల్లా కోశాధికారిగా జిల్లాలో సేవలు అందించిన వి. సత్యనారాయణ, మహబూబాబాద్ జిల్లాకు బదిలీ అయిన సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సి.ఈ.ఓ. దీక్ష రైనా, డి.ఆర్.డి.ఓ. సన్యాసయ్య , కలెక్టరేట్ ఏ.ఓ. అరుణ, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



**భద్రాచలం, అక్టోబర్ 7 (మనం న్యూస్):** ప్రసాద్ పథకం కింద చేపట్టిన పనులు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. సోమవారం దుమ్ముగూడెం మండలం లోని పర్ణశాల శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానమును ఆయన సందర్శించారు. స్వామి వారిని దర్శించుకొని, సీతమ్మ వారి నార చీరల ప్రదేశము సీతవాగు సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రసాద్ పథకము ద్వారా చేపట్టిన పనులు ఆలస్యం కాకుండా పనులు వేగవంతం చేసి తొందరగా పూర్తయ్యే విధంగా ప్రత్యేక శ్రద్ధ చూపాలని దేవస్థానంకు సంబంధించిన భూములను ఆయన పరిశీలించి, దేవస్థానము చుట్టూ ఉన్న ఖాళీ ప్రదేశంలో భక్తులకు నీడనిచ్చే చెట్లను నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని అన్నా రు. అలాగే పర్ణశాల దేవస్థానం పక్కనున్న పార్కింగ్ స్థలంలో భక్తులు పార్కింగ్ చేయడానికి ,భక్తులకు సౌకర్యాలు కల్పించాలని అన్నారు. అలాగే ఖాళీ ప్రదేశాలలో తులసి వనం ఏర్పాటుచేసి ఔషధ మొక్కలు తులసి, తిప్పతీగ, మల్లేరు, అశ్వగంధ లాంటి ఔషధ గుణానికి సంబంధించిన మొక్కలు పెంచి భక్తులకు తెలిసే విధంగా వాటి యొక్క సమాచారం ప్రదర్శించాలని అన్నారు. ప్రసాద్ పథకం కింద చేపట్టే పనులు భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించే విధంగా చేపట్టాలని, అందుకు దేవస్థానం అధికారులు, పంచాయతీరాజ్ అధికారులు, పనులు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తయ్యే విధంగా చూడాల న్నారు. అనంతరం బొజ్జుగుప్ప, రామచంద్రుని పేట గ్రామాలను సందర్శించి ట్రైబల్ మ్యూజియంను అభివృద్ధి చేయడానికి ట్రైబల్‌కు సంబంధించిన సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా ఈ గ్రామాలలో గృహాలు ఏర్పాట్లు చేయాలని, ప్రస్తుతం ఉన్న గృహాలు పాతకాలమునకు సంబంధించిన గృహాల మాదిరి ఉన్న, ఇంకా వాటిని పాతకాలపు మట్టితో కట్టిన గృహాల మాదిరి తయారుచేయాలని, ట్రైబల్ మ్యూజియానికి వచ్చే సందర్శకులు ఆకర్షించడానికి మట్టితో కట్టినవి చూడడానికి ఆదివాసి గిరిజనుల సంస్కృతి సాంప్రదాయా లు ప్రతిబింబించేలా గృహ నిర్మాణాలు చేపట్టాలని అన్నారు. అలాగే పాతకాలపు ఎడ్లబండ్లు, గిరిజన రైతులు చేసే వ్యవ సాయము పూర్తిగా తాతల కాలం నాటి వ్యవసాయ పద్ధతులు పాటించేలా ఏర్పాటు చేయాలని అన్నారు. అలాగే పంటలు సాగు చేసుకునే గిరిజన రైతులు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చే అంతర పంటలు వేసు కొని లబ్ధి పొందాలని, అందుకు పొలం గట్ల వెంట, ఇంటి వెనక పెరడులో మునగ చెట్లు, జామ చెట్లు, ఇతర ఫలాలకు సంబంధించిన చెట్లు వేసుకుని జీవనోపాధి పొందాలని రైతుల కు సూచించారు. ఈ కార్యక్రమంలో దుమ్ముగూడెం తహశీల్దార్ అశోక్ కుమార్, ఎంపీడీవో యాదయ్య, ఎంపీ ఓ రామకృష్ణ, పర్ణశాల దేవస్థానం పర్యవేక్షకుడు అనిల్ కుమార్, ఆర్ఐ వెంకటేశ్వర్లు, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

# ధనార్జనే ధ్యేయం

- హద్దు మీరుతున్న గ్రామీణ వైద్యులు
- నెల వ్యవధిలో ఇద్దరు మృతి
- పట్టించుకోని అధికారులు



**చర్ల, అక్టోబర్ 7 (మనం న్యూస్) :** ధనార్జనే ధ్యేయంగా గ్రామీణ వైద్యులు వ్యచహరిస్తున్నారు. ఊరుకి ఇద్దరు ముగ్గురు చొప్పున మండల వ్యాపితంగా ఆర్ ఎం పి వైద్యశాలలు పుట్టు కొస్తున్నాయి. ఇంగ్లీష్ లో మందుల చిట్టీ రాయలేవి వారు సైతం డాక్టర్ల అవతారమెత్తు తున్నారు. వచ్చీరాని వైద్యం చేసి రోగుల ప్రాణాలను తీస్తున్నారు. చర్ల మండలంలో ఆర్ఎంపిల వైద్యం వికటించి నెలరోజుల వ్యవదిలో ఇద్దరు యువతులు మృతి చెందారు. ఇంత జరుగుతున్నా వైద్య ఆరోగ్య శాఖ అదికారులు నిమ్మకునీరెత్తిన చందంగా వ్యవహరిస్తున్నారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో గ్రామీణ వైద్యులు చెలరేగిపోతున్నారు. పట్టుమని పదవ తరగతి చదవని వారు సైతం మెడలో స్టెతస్కోప్ వేసుకొని డాక్టర్ అవతార మెత్తుతున్నారు. కుటుంబ పోషణ కోసం పట్టణ ప్రాంతాలలోని అర్హులయిన వైద్యుల వద్ద ఆరు నెలల పాటు కాంపౌండర్లుగా పని చేసి గ్రామీణ ప్రాంతాలకు వచ్చి వైద్యుల అవతార మెత్తుతున్నారు. మొదట ద్విచక్ర వాహనం పై గ్రామాలకు వెళ్లి అక్కడే వైద్యం చేస్తుంటారు. ఏడాది వరకు అక్కడి వారితో పరిచయాలు పెంచుకొని చర్లతో పాటు కొన్ని పెద్ద గ్రామాలలో క్లినిక్ లను ఏర్పాటు చేస్తున్నారు. ఇలా చర్ల మండల వ్యాపితంగా సుమారు 50 మందికి పైగా ఆర్ఎంపిలు ఉన్నారు. గ్రామీణ వైద్యులు రోగులకు ప్రదమ చికిత్స మాత్రమే చేయాలని ప్రభుత్వం నిబంధనలు విదించింది. ఇవేమి పట్టని వారు ధనార్జనే ధ్యేయంగా రోగులను పీల్చి పిప్పి చేస్తున్నారు. ప్రథమ చికిత్సతో సరి పెట్టకుండా తమకు మించిన వైద్యం చేస్తూ రోగుల ప్రాణాలను తీస్తున్నారు. సీరియస్ కేసులను తమ వైద్య శాలలో చేర్పించుకొని వైద్యం అందిస్తున్నారు. ఇటీవల కొంతమంది గ్రామీణ వైద్యులు మెడికల్ దుకాణాలను సొంతంగా నిర్వహిస్తూ రోగులను జలగలుగా పీడిస్తున్నారు. అదిక యాంటిబయోటిక్స్, అధిక డోస్ ఇంజక్షను రోగులకు ఇస్తూ వారి ఆరోగ్యాన్ని పాడు చేస్తున్నారు. కొంతమంది అవగాహనా రాహిత్యంతో ఉదయం, మద్యాహ్నం, రాత్రి సమయాలకు ఒకటి చొప్పున మూడు రకాల యాంటిబయోటిక్స్ లను ఇస్తూ రోగుల వ్యాధి నిరోధక శక్తిని దెబ్బ తీస్తున్నారు. ప్రభుత్వ వైద్యశాలలో అంతంత మాత్రంగా వైద్య సేవలు అందుతుండటంతో రోగులు ఎక్కువగా గ్రామీణ వైద్యశాలలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా భావించి ఇష్టానుసారంగా మందులు, సెలైన్ లను పెట్టి రోగుల నుండి భారీగా డబ్బు గుంజుతున్నారు. రోగి పరిస్థితి విషమించే వరకు తమ దగ్గరే ఉంచుకొని చివరి క్షణంలో చేతి లెత్తేస్తున్నారు. కొంతమంది ఆర్ఎంపిలు పట్టణ ప్రాంత అర్హులయిన పెద్ద వైద్యశాలలతో సంబంధాలను నెలకొల్పుకొని అవసరం లేకపోయినా రోగులను అక్కడికి పంపించి కమీషన్లు దండుకొంటున్నారు. చర్ల మండలంలో నెల రోజుల వ్యవధిలో గ్రామీణ వైద్యుల చేతిలో ఇద్దరు యువతులు డెంగ్యూ చికిత్స పొందుతూ మృతి చెందారు. రోగి మృతి చెందిన తర్వాత బంధువులను బ్రతిమాలి లేదా డబ్బు ఆశ చూపించి మసిపూసి మారేడు కాయను చేస్తున్నారు. వారితో కార్డియాక్ అరెస్ట్ కారణంగా మృతి చెందారంటూ చెప్పించి సమస్యను పక్కదోవ పట్టిస్తున్నారు. ఇంత జరుగుతున్నా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అదికారులు నిమ్మకు నీరెత్తిన చందంగా వ్యవహరిస్తున్నారు. అర్హత మించి వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్న వారిపై చర్యలు తీసుకోకుండా ప్రేక్షక పాత్రకే పరిమితమవుతున్నారు. రోగి మృతి చెందిన సందర్భంలోనూ కనీసం విచారణ చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అదికారులు ఇప్పటికయినా పరిధికి మించి వైద్యం చేస్తున్న ఆర్ఎంపిలపై చర్యలు తీసుకోకుంటే భవిష్యత్తులో మరిన్ని ప్రాణాలు గాలిలో కలసి పోవడం ఖాయం.

## మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలి



- మహిళలకు ఇస్తానన్న రూ.2,500 హామీని అమలు చేయాలి
- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్
- మహిళల హక్కుల సాధనకు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి
- ఐద్వా రాష్ట్ర నాయకురాలు బుగ్గవీటి సరళ పిలుపు
- ఉత్సాహపూరితంగా ఐద్వా ఖమ్మం జిల్లా 12వ మహాసభ
- మహాసభ సందర్భంగా మహిళలతో భారీ ప్రదర్శన

**ఖమ్మం, అక్టోబర్ 7(మనం న్యూస్):** మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని, మహిళల హక్కుల సాధనకు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలనీ ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు. లక్ష్మి పిలుపునిచ్చారు. స్థానిక నాగార్జున ఫంక్షన్ హాల్ లో ఐద్వా 12వ మహాసభ కొండపల్లి దుర్గాదేవి నగర్ లో ఘనంగా ఉత్సాహపురితంగా జరిగింది. మహాసభ ప్రారంభానికి ముందుగా సత్తెనపల్లి రామకృష్ణ భవన్ సిపిఎం ఆఫీస్ నందు మహాసభ ప్రారంభ సూచికగా ఐద్వా జెండాను మొట్టమొదటి ఐద్వా జిల్లా కార్యదర్శి సీనియర్ నాయకురాలు ఏపూరి జయమ్మ ఆవిష్కరించారు. తొలుత సత్తెనపల్లి రామకృష్ణ భవన్ నుండి నాగార్జున ఫంక్షన్ హాల్ వరకు ఐద్వా జెండాలతో మహిళలు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అమరవీరులకు నివాళి అర్పించారు. ఐద్వా జిల్లా అధ్యక్షులు బండి పద్మ, మెరుగు రమణ, మెహరునిష బేగం అధ్యక్ష వర్గంగా జరిగిన మహాసభకు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుండి ఎంపికైన ప్రతినిధులు హాజరయ్యారు. ఈ మహాసభనుద్దేశించి ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ మోడీ, బిజెపి మూడో సారి అధికారంలోకి వచ్చాక మహిళల సాధికారత, 33 శాతం రిజర్వేషన్ల అమలు ,హక్కుల గురుంచి మాటలు చెప్పడం తప్ప చేతలో ఏమి చేయలేదని ఆమె ఆరోపించారు. తండ్రి ఆస్తిలో ఆడపిల్లకు సమాన హక్కును, మహిళా శిశు ప్రంగాణాలను, వరకట్న నిషేధ చట్టం కల్పించడంలో బిజెపి, మోడీ విఫలమైందన్నారు. ప్రతి మహిళకు రూ.2,500 ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఆ హామీని నెరవేర్చాలన్నారు. ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితం కాకుండా వారి హక్కుల సాధనకు కృషి చేయాలని, సమస్యలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఆమె పిలుపునిచ్చారు. తదనంతరం ఐద్వా జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి గత మూడు సంవత్సరాలుగా జిల్లాలో ఐద్వా చేసిన పోరాటాలను, భవిష్యత్ కర్తవ్యాలను ఉద్యమ నిర్మాణ నివేదికను ప్రవేశపెట్టారు. ఈ మహాభలో జిల్లా నాయకులు మున్సిపాలిటీ మాజీ చైర్ పర్సన్ అప్రోజ్ సమీన, నాగసులోచన, ప్రభావతి, కృష్ణవేణి, రజిత, పకీరమ్మ, సునీత, అమరావతి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

## గౌర్ సేవలు ప్రశంసనీయం.. చరిత్ర అజరామరం

- సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్



**ఖమ్మం, అక్టోబర్ 7(మనం న్యూస్):** రాజ్యసభ సభ్యులుగా, ట్రేడ్ యూనియన్ నాయకులుగా రాజ్బహదూర్ గౌర్ అందించిన సేవలు ప్రశంసనీయమని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. కామ్రేడ్స్ అసోసియేషన్ సభ్యులుగా, సిపిఐ నాయకులుగా, సాయుధ పోరాట యోధునిగా గౌర్ చరిత్ర అజరామరమని ప్రసాద్ తెలిపారు. రాజ్బహదూర్ గౌర్ 13వ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోటు. ప్రసాద్ మాటాడుతూ విద్యార్థి దశలోనే వామపక్ష భావజాలాన్ని అలవర్చు కున్న గౌర్ సోషలిస్టు విప్లవంతో ప్రభావితుడయ్యాడని, మగ్దూం మోహినుద్దీన్ తో కలిసి హైదరాబాద్ కామ్రేడ్ అసోసియేషన్లో కీలక భూమిక పోషించారని ప్రసాద్ తెలిపారు. ఆల్ హైదరాబాద్ స్టూడెంట్ ఫెడరేషన్ నాయకత్వ బాధ్యతలు నిర్వహించిన గౌర్ సాయుధ తెలంగాణ పోరాటంలో పాల్గొని జైలుకు వెళ్లారన్నారు. జైలులోనే ఉండి రాజ్యసభకు ఎన్నికైన ఘనత రాజాబహదూర్ గౌర్కు దక్కుతు ందని ప్రసాద్ తెలిపారు. రెండుసార్లు రాజ్యసభకు ఎన్నికైన గౌర్ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. రైల్వేస్, సింగరేణి, ఆర్టిసి, మిల్లు కార్మిక సంఘాలను స్థాపించడంలో కీలక భూమిక పోషించారన్నారు. ఇంగ్లీష్, ఉరూద్లో అపార జ్ఞానం కలిగిన గౌర్ పలు వ్యాసాలు రాశారని వాటిని సంకలంగా రూపొందించారని ప్ర సాద్ తెలిపారు. గౌర్ ఆశయ సాధన కోసం ప్రజా ఉద్యమ నిర్మా ణమే ఆయనకు సరైన నివాళి అని ప్రసాద్ తెలిపారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర సమితి సభ్యులుజమ్ముల జితేందర్ రెడ్డి, యర్రాబాబు, ఎస్ కె జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, తాటివెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, పగడాల మ ల్లేస్, గాదె లక్ష్మి నారాయణ, నూనె శశిధర్, ఏఐవైఎఫ్, ఏఐఎస్ ఎఫ్ జిల్లాకార్యదర్శులు నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ తది తరులు పాల్గొన్నారు.

# జీవన స్థితిగతులను మార్చేది విద్యే

- పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దండి
- పాఠశాల నిర్మించిన సిఐ అభినందనీయులు
- పాఠశాల ప్రారంభోత్సవంలో ఎస్‌పి రోహిత్ రాజ్



**చర్ల, అక్టోబర్ 7 (మనం న్యూస్) :** విద్య మనిషి జీవన స్థితిగతులను మారుస్తుందని ప్రతి ఒక్కరూ విద్యపై దృష్టి సారించి ఉన్నత స్థితికి చేరుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ అన్నారు. సోమవారం చర్ల మండలంలోని మారుమూల అటవీ ప్రాంత గ్రామమైన బూరుగుపాడులో ఆయన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ప్రారంభించారు. పూర్తి మావోయిస్టు ప్రభావితం ప్రాంతం కావడంతో కట్టుదిట్టు కట్టుదిట్టమైన భద్రత నడుమ పాఠశాలను ప్రారంభించారు. పాఠశాలను చర్ల సిఐ రాజు వర్మ తన సొంత ఖర్చులతో నిర్మించారు. ఈ సందర్భంగా సీఐ రాజు వర్మ అధ్యక్షతన జరిగిన సభలో ఎస్పీ రోహిత్ రాజ్ గిరిజనుల ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థుల తల్లిదండ్రులు తరతరాలుగా చదువుకోలేదని, ఈ పరిస్థితి మీ పిల్లలకు రానివ్వకుండా చూడాలని హితబోదచేశారు. విద్య ద్వారానే క్రమశిక్షణ అలవడి చిన్నారులు పక్కదారి పట్టకుండా సన్మార్గంలో నడుస్తారని పేర్కొన్నారు. విద్యార్థులను పాఠశాలలకు పంపించే బాధ్యత తల్లిదండ్రులదేనని, ఇక్కడితోనే చదువును నిలిపివేయకుండా పట్టణ ప్రాంతాలకు వెళ్లి ఉన్నత చదువులు చదవడం ద్వారా జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. విద్యతో పాటు వైద్యం కూడా ఎంతో ప్రాధాన్యత కలదని గిరిజనులు నాటు వైద్యం చేయించుకొని ప్రాణాలపైకి తెచ్చుకోవద్దని సూచించారు. అనారోగ్యం కు గురైన వెంటనే ప్రభుత్వ వైద్యశాలలకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. గతంలో మాదిరి మావోయిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితులు కావద్దని ఇకపై మంచి నడవడికతో ఉండాలని గిరిజనులకు సూచించారు. ప్రస్తుతం ఫ్రెండ్లీ పోలీసింగ్ నడుస్తోందని పోలీసులంటే భయపడొద్దు అన్నారు. దీనికి నిదర్శనం ఇక్కడ పాఠశాలను నిర్మించడమేనని అన్నారు. సీఐ రాజువర్మ తన సొంత ఖర్చులతో పాఠశాలలను నిర్మించడం అభినందనీయమని అన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా పోలీసుల ఔదార్యాన్ని నలుగురికి చాటి చెప్పడం గర్వకారణంగా ఉందన్నారు. కొత్తగూడెం ఓ ఎస్ డి సాయి మనోహర్ మాట్లాడుతూ ఏకే 47 తుపాకీ కంటే విద్యే పవర్ ఫుల్ అని అన్నారు. గిరిజనులకు పోలీస్ శాఖ నుండి అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తామన్నారు. మావోయిస్టులు స్వార్థం కోసం గిరిజనులను ఉపయోగించుకుంటున్నారని పేర్కొన్నారు. అటువంటి స్వార్దపరుల పట్ల ఆకర్షితులు కాకుండా ఉండాలని విజ్ఞప్తి చేశారు. రాజు వర్మ లాంటి నిజాయితీగల పోలీస్ అధికారి తమ శాఖలో విధులు నిర్వహించడం గర్వకారణంగా ఉందన్నారు. సీఐ రాజు వర్మ మాటాడుతూ మొట్టమొదటిసారిగా గ్రామాన్ని సందర్శించిన సందర్భంలో పాఠశాల దుస్థితి చూసి చలించిపోయానన్నారు. విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఇవ్వాలనే తలంపుతో పాఠశాల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల చిన్నారులు, గ్రామస్తులు చేసిన ఆదివాసీ సాంప్రదాయ రేల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ, ఎస్ బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్ఐ నర్సిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సవలం వీరస్వామి గ్రామస్తులు దేవయ్య, గంగయ్య పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలి

- మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

**మహబూబాబాద్, అక్టోబర్ 7(మనం బ్యూరో):** ప్రజలు ప్రజావాణి ద్వారా దరఖాస్తు చేసుకున్న ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి లో జిల్లా స్థానిక సంస్థలు, రెవెన్యూ అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, ఎం.డేవిడ్ లతో కలిసి జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా వివిధ శాఖల కు సంబంధించి వచ్చిన మొత్తం (74) దరఖాస్తులను అధికారులు పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని అన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జెడ్.పి.సీ.ఈ.ఓ నర్మద,డి.సీ.ఓ వెంకటేశ్వర్లు, ఉద్యానవన శాఖ అధికారి జి.మరియన్న, ఏ.డి.సర్వే ల్యాండ్ అధికారి నరసింహామూర్తి, గ్రౌండ్ వాటర్ అధికారి సురేష్,డి.పి.ఓ హరిప్రసాద్, మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఫోటోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి చేస్తా

- అర్హులైన ఫోటోగ్రాఫర్‌లకు ప్రభుత్వ పథకాలు అందిస్తాం

**సుల్తానాబాద్,అక్టోబర్ 07 (మనం న్యూస్) :** నియోజకవర్గంలోని ఫోటో వీడియోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి చేస్తానని, అర్హులైన ఫోటోలు వీడియో గ్రాఫర్లు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ఆదివారం నరసయ్య పల్లిలోని విజయ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన సుల్తానాబాద్ మండల ఫోటో వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథిగా పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు హాజరయ్యారు.ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా ఫోటో భవన్ నిర్మాణానికి త్వరలోనే నిధులను అందిస్తానని అన్నారు. నిరుపేద ఫోటోగ్రాఫర్లు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఫోటో వీడియోగ్రాఫర్ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరి రవి నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు పూసాల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి వడ్లకొండ శశివర్ధన్, కోశాధికారి మేరుగు హరీష్ లచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం సిరి రవి మాట్లాడుతూ ఫోటో వీడియోగ్రాఫర్స్ ఐక్యమత్యంగా ఉండాలని అన్నారు.ఫోటో,వీడియోగ్రాఫర్ లకు జిల్లా, రాష్ట్ర అసోసియేషన్ లు అండగా ఉంటుందని అన్నారు.పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు పోగుల విజయ్ కుమార్ మాట్లాడుతూ జిల్లా ఫోటో,వీడియోగ్రాఫర్లు అందరూ కుటుంబ భరోసా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఫోటో భవన్ నిర్మాణానికి నిధులు అందిస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం అసోసియేషన్ సభ్యులకు ఐడి కార్డులు అందించారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు మహిమాల కేదార్ రెడ్డి, రాజేష్ రెడ్డి,అశోక్,ఉదయ్,ఫోటోఫామ్ అధినేత రేకులపల్లి సుష్మ శశాంక,జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి ఇర్ఫాన్, జిల్లా కోశాధికారి అల్లం సతీష్,గౌరవ సలహాదారులు కుర్మ రమేష్ బాబు, గంధం రాజేష్,బీట్ల రమేష్,యెల్ల రాజు,సంపత్, సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ గాజుల లక్ష్మి రాజమల్లు, నాయకులు అంతటి అన్నయ్య గౌడ్, మినుపాల ప్రకాష్ రావు, సాయిరి మహేందర్, పెద్దన్న,కిషోర్,సతీష్,న్యాయ సలహాదారులు ఆవుల శివక్రిష్ణ, పలు మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారిలతో పాటు అధిక సంఖ్యలో ఫోటో,వీడియో గ్రాఫర్స్ పాల్గొన్నారు.





## ప్రత్యేక అధికారుల పాలనపై అసంతృప్తి

**వీణవంక, అక్టోబర్ 7 (మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్రప్రభుత్వం సర్పంచులు పదవికాలం ముగిసిన తరువాత గ్రామపంచాయతీలలో ప్రత్యేక అధికారులను నియమించింది. కొన్ని గ్రామాలలో ప్రత్యేక అధికారులు ప్రజాసమస్యలను పట్టించుకో వడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాలలో పాలకమండలి లేక అభివృద్ధి పనులు నిలిచిపోయాయని రాష్ట్ర ప్రభుత్వం బీసి కులగణనను వేగవంతం చేసి సర్పంచుల ఎన్నికలుత్వరలో నిర్వహించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## ఆలయంలోని పలు శాఖల్లో ఈవో తనిఖీ

**వేములవాడ, అక్టోబర్ 07 (మనం న్యూస్) :** దక్షిణ కాశిగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీరాజ రాజేశ్వర స్వామి వారి ఆలయ ఈవో కె వినోద్ రెడ్డి లడ్డూ కౌంటర్, ప్రోటోకాల్ ఆఫీస్, క్యూలైన్స్, కోడె బుకింగ్ కేంద్రాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భక్తులకు దర్శనంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండాలని ఈవో ఆలయ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. క్యూలైన్లలో వచ్చే భక్తులకు మంచినీటి సౌకర్యం, మెరుగైన వసతులు కల్పించాలని, బత్తుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని సూచనలను చేశారు. ఆయన వెంట ఆలయ పర్యవేక్షకులు తిరుపతి రావు, ప్రోటోకాల్ పర్యవేక్షకులు అశోక్, ఎడ్ల శివసాయి తోపాటు తదితరులు ఉన్నారు.

## ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ పోటీలకు ఆహ్వానం

**ఖమ్మం, అక్టోబర్ 7(మనం న్యూస్):** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్ డే)ను పురస్కరించుకొని ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లకు ఫోటోగ్రఫీ, అదేవిధంగా షార్ట్ ఫిల్మ్ కు సంబంధించి తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఇందుకు సంబంధించి పోలీస్ కమిషనర్ వివరాలను వెల్లడిస్తూ (పోలీస్ ఫ్లాగ్ డే) పోలీస్ అమరవీరుల ప్రాణత్యాగాలను స్మరిస్తూ ఈనెల 21 న వారోత్సవాలు నిర్వహించబడుతాయని అన్నారు. ఇందులో భాగంగా పోలీసుల త్యాగాలు, పోలీసు విధుల్లో ప్రతిభను తెలిపే విధంగా ఉండే ఇటీవల కాలంలో తీసిన (3) ఫోటోలు, తక్కువ నిడివి (3 నిమిషాలు) గల షార్ట్ ఫిలిమ్స్ తీసి రాష్ట్రస్థాయి పోటీల కోసం ఈ నెల 20వ తేదీలోపు ఖమ్మం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సంబంధిత షార్ట్ ఫిల్మ్ లోడ్ చేసిన పెన్ డ్రైవ్, ఫోటోలను పోలీస్ పిఆర్‌వోకు అందజేయాలన్నారు. ఈ పోటీలకు నామినేషన్లు పంపించే ఔత్సాహికులు అత్యవసర సమయాల్లో పోలీసులు స్పందన. ప్రకృతి వైపరిత్యాల్లో పోలీసుల సేవ, ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తి ప్రతిష్టలను పెంపొందించే అంశాలకు సంబంధించి గత సంవత్సరం 2023 అక్టోబర్ నుండి ప్రస్తుత సంవత్సరం అక్టోబర్ నెల ఇప్పటివరకు తీసిన మూడు ఫోటోలు, షార్ట్ ఫిల్మ్ మాత్రమే పంపించాల్సి వుంటుంది. మరిన్ని వివరాల కోసం 8712659 256 నెంబర్ ద్వారా పీఆర్ఓ ను సంప్రదించాలన్నారు.

# పోలీసులకి క్రీడలు మానసిక ఉల్లసాన్ని కలిగిస్తాయి



- రెండవ పోలీస్ ఆన్యువల్ స్పోర్ట్స్ మీట్
- లాంఛనంగా ప్రారంభించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 07 (మనం న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా రెండవ వార్షిక గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ పోటీలు సిరిసిల్ల మినీ స్టేడియంలో సోమవారం రోజున జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ముఖ్య అతిథిలుగా హాజరై శాంతికపోతాలను,బెలూన్స్ ఎగురవేశారు.అనంతరం పోలీస్ క్రీడాకారులు ఒలంపిక్ కాగడ చేతభూని తీసుకొని పరేడ్ గ్రౌండ్ చుట్టు పరుగెత్తి క్రీడాజ్యోతి వెలిగించిన అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించి లాంఛనంగా ప్రారంభించారు.అధికారులు , సిబ్బందితో కలసి షటిల్,కబడ్డీ, వాలిబల్ ఆడి అందరిని ఉత్సాహపరిచారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణలో నిత్యం బిజీగా ఉన్నప్పటికీ సిబ్బంది క్రీడల్లో పాల్గొనడం వారిలో నూతనోత్సాహాన్ని నింపుతుందనే ఉద్దేశ్యంతో జిల్లాలో రెండవ సారి స్పోరట్స్ మీట్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఈ మీట్ లో పోలీస్ అధికారులు, సిబ్బంది ఉత్సాహకంగా పాల్గొనాలని, ఆటల్లో గెలుపోటములనేవి సహజమేమని గెలుపోటముల కంటే టీమ్ స్పిరిట్ గొప్పదన్నారు. అధికారులకు, సిబ్బంది ప్రతి ఒక్కరికి డ్యూటీ,ఫ్యామిలీ ఒత్తిడి ఉంటుందని క్రీడలు ఆడటం వలన మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృఢత్వంతో పాటుగా ఆరోగ్యంగా ఉంటారన్నారు.పోలీస్ విభాగంలో విధినిర్వహణలో క్రీడలు,యోగ అనేవి ఎంతో అవసరమన్నారు, విధి నిర్వహణలో భాగంగా మనం ఎంతో కఠినమైన పరిస్థితి ఎదుర్కొన వలసి వస్తుందని శారీరకంగా ధృఢంగా ఉండటానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించే సిబ్బందికి ఇలాంటి క్రీడల వలన ఉద్యోగుల్లో స్నేహ సంబంధాలు ఏర్పడటంతో పాటుగా ఉద్యోగుల్లో నూతనోత్సాహాన్ని నింపుతాయని అన్నారు.ఈ పోటీలు మూడు రోజుల పాటు డిఏఆర్ హంటర్, సిరిసిల్ల స్టైకర్స్,వేములవాడ విక్టర్స్, వేములవాడ రుద్రస్, సిరిసిల్ల సోల్జర్స్, డిఎఆర్ రేంజర్స్ జట్ల మధ్య క్రికెట్, షటిల్ బ్యాట్మెంటన్, వాలీబాల్, బాస్కెట్ బాల్, కబడ్డీ, తగ్గాఫర్, హై జంప్, లాంగ్ జంప్, షాట్ పుట్, డిస్కస్ త్రో, అథెలిటిక్స్ క్రీడలు జరుగుతాయని, తెలిపారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సి.ఐ లు కృష్ణ, మొగిలి,శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఆర్.ఐ లు మధుకర్, రమేష్,ఎస్.ఐ లు,వ్యాయమ ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఉత్తర తెలంగాణను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ వి నరేందర్ రెడ్డి

**కొమురం భీమ్ ఆసిఫాబాద్, అక్టోబర్ 7 (మనం న్యూస్) :** రానున్న పట్టభద్రులు ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఉత్తర తెలంగాణను ఎడ్యుకేషన్ హబ్ గా తీర్చిదిద్దుతానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆసిఫాబాద్ పట్టణంలో పట్టబద్రుల ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రంథాలయం తో పాటు బార్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు.రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపాలని కోరారు. మొదటగా పట్టణములో సాయి బాబ దేవాలయం లో బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి చౌరస్తాలోని డా బి ఆర్ అంబెడ్కర్ ,కొమురం భీం విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు.. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పట్టపద్రుల సమస్యల పరిష్కారానికి ఒక సేవకుడిలా పని చేస్తానని అన్నారు.పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగ యువతకు స్టడీ మెటీరియల్ తో ఒక యాప్ ను సిద్ధం చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ యాప్‌ను 15 రోజుల్లో ప్రవేశపెడుతున్నట్టు వెల్లడించారు. తన ఎమ్మెల్సీ పరిధిలోని 4 ఉమ్మడి జిల్లాలలో తన సొంత నిధులతో ఉచిత కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తానని వెల్లడించారు.ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న ఉద్యోగుల ప్రధాన డిమాండ్ అయిన ఓల్ పెన్షన్ స్కీం ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అమలు చేపిస్తానని వెల్లడించారు.తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యువ న్యాయవాదులకు 5 వేలు గౌరవ వేతనం ప్రభుత్వం నుంచి వచ్చే విధంగా కృషి చేస్తానన్నారు. ఆసిఫాబాద్ లో 90 మంది టీచర్లు గెస్ట్ టీచర్లుగా పని చేస్తున్నారని వారిని కాంట్రాక్ట్ రెగ్యులర్ టీచర్ లు గా గుర్తించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో పనిచేసే పార్ట్ టైం టీచర్లకు ,గెస్ట్ లెక్చరర్లకు , ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికి ఒకే జీతం అందే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సమస్యను పరిష్కరిస్తామన్నారు.రాష్ట్రంలో మోడల్ స్కూల్ , గురుకులం తో పాటు ఎయిడెడ్ పాఠశాలల్లో పేరుకున్న సమస్యలను పరిష్కరించేందుకు ఒక ప్రణాళిక బద్ధంగా ముందుకెళుతున్నట్టు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు టీచర్లు ఎస్జిటి టీచర్లకు టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని. వారిని ఈ ఎన్నికల్లో కాకుండా రాబోయే ఎన్నికల్లో అర్హులు గా గుర్తించేందుకు కృషి చేస్తానన్నారు.ఎమ్మెల్సీగా ఎన్నికైన తర్వాత తనకు వచ్చే ప్రభుత్వ వేతనాన్ని నిరుద్యోగ పట్టభద్రులకు నిరుపేద విద్యార్థులు సంక్షేమానికి ఖర్చు చేస్తానని అన్నారు.. ఆసిఫాబాద్ లో ఒకే స్టడీ ఎస్ టి సెంటర్ ఉందని.. రానున్న రోజుల్లో బీసీ, ఎస్సీ స్టడీ సెంటర్ లను నెలకొల్పుతామని హామీ ఇచ్చారు..జిల్లావ్యాప్తంగా ఉన్న లైబ్రరీలను సెంట్రల్ లైబ్రరీగా మార్చి నిరుపేద విద్యార్థులకు అందుబాటులో తెస్తానని అన్నారు..



# చేనేత కార్మికుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం



- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు

**కరీంనగర్ టౌన్, అక్టోబర్ 7( మనం న్యూస్ ):** సిరిసిల్ల నేత కార్మికులు గత 30 ఏళ్లుగా ఎదురు చూస్తున్న యార్న్ డిపో దసరా కానుకగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిందని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. వేములవాడలో యార్న్ డిపో మంజూరు తో సిరిసిల్లలో వేలాది మంది కార్మికులకు ప్రయోజనం కలుగనుందని ఉందని తెలిపారు.సోమవారం వెలిచాల రాజేందర్ రావు మీడియాతో మాట్లాడుతూ సిరిసిల్ల నేత కార్మికుల 30 ఏళ్ల కల కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ పాలకులు సిరిసిల్లలో యార్న్ డిపో ఏర్పాటు చేస్తామంటూ ప్రగల్భాలు పలికారని మండిపడ్డారు. మాజీ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఆ విషయాన్ని ఏమాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. యార్న్ డిపో మంజూరు చేయించలేక పూర్తిగా వైఫల్యం చెందారని విమర్శించారు. గత బిఆర్ఎస్ పాలకులు 10 ఏళ్ల కాలంలో సాధించినది కాంగ్రెస్ ప్రభుత్వం పది నెలల్లోనే యార్న్ డిపో మంజూరు చేసి నేత కార్మికుల కలలను నెరవేర్చిందన్నారు. డిపో మంజూరు తో బతుకమ్మ సంబరాలు, దసరా పండుగను నేత కార్మికులు మరింత ఘనంగా వారి ఇళ్లలో వెలుగులు నిండేలా జరుపుకుంటారని ఆయన పేర్కొన్నారు. ఇందుకోసమే బతుకమ్మ, దసరా పండుగను కార్మికులు వైభవంగా జరుపుకోవాలని ప్రభుత్వం యార్న్ డిపో మంజూరు చేసిందనితెలిపారు.వేములవాడ కేంద్రంగా యార్న్ డిపో మంజూరు చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, ఇందుకు ప్రత్యేకంగా కృషి చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తో పాటు ఎమ్మెల్యేలకు వెలిచాల రాజేందర్ రావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 7 (మనం న్యూస్ ):** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి.. సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.పలు అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు.ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మి కిరణ్ (రెవిన్యూ), ప్రఫుల్ దేశాయ్(స్థానిక సంస్థలు), మున్సిపల్ కమిషనర్ చాహత్ భాజ్ పాయ్, డీఆర్ఓ పవన్ కుమార్, తో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మండలాల అధికారులకు సూచించారు. ప్రజావాణిలో రెవెన్యూ, పెన్షన్, భూ సమస్యలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం మొత్తం 169వినతులు వచ్చాయి.కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా ఉన్నతాధికారులు, తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రపంచ శాంతికి భంగం కలిగిస్తున్న ఇజ్రాయిల్

- అలీన విధానానికి తిలోదకాలు ఇచ్చిన మోడీ
- ఖమ్మంలో వామపక్షాల ప్రదర్శన




**ఖమ్మం, అక్టోబర్ 7(మనం న్యూస్):** పాలస్తీనాపై ఏడాదిగా యుద్ధం చేస్తున్న ఇజ్రాయిల్ ప్రపంచ శాంతికి భంగం కలిగిస్తున్నదని వామపక్షాల నేతలు ఆరోపించారు. యుద్ధంతో వేలాది మంది ప్రాణాలు బలిగొంటుందని లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులు అవుతున్నారని వారు తెలిపారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను నిరసిస్తూ సోమవారం వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. పాత కలెక్టరేట్ ఎదురుగా గల చాకలి బలమ్మ విగ్రహం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్లో వామపక్షాల నాయకులు మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాద ముసుగులో ఇజ్రాయిల్ యుద్ధకాండ కొనసాగిస్తుందని, గాజాపై జరిపిన దాడుల్లో 50వేల మంది మరణించారని ఇందులో 75 శాతం వృద్ధులు, పిల్లలే ఉన్నారని వారు తెలిపారు. ఇజ్రాయిల్ పశ్చిమాసియా దేశాలపై యుద్ధానికి తెగబడుతుందని దీంతో ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన నెలకొందన్నారు. అంతర్జాతీయ న్యాయ స్థానం ఐక్యరాజ్య సమితి హెచ్చరించినా దాడులను ఇజ్రాయిల్ ఆపకపోవడం శోచనీయమన్నారు. చమురు సంస్థలపై ఆధిపత్యం కోసం ఇజ్రాయిల్ యుద్ధం చేస్తుందని, ఇజ్రాయిల్ ముడి చమురుపై ఆధిపత్యం, అమెరికాకు ఆయుధాలు అమ్మకం జరగాలని ఈ రెండు దేశాలు కుట్ర ఫలితమే ఈ యుద్ధమని వామపక్ష నేతలు తెలిపారు. మారిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన నేపథ్యంలో యుద్ధాన్ని తక్షణం నిలిపివేయాలని వాయుపక్ష నేతలు డిమాండ్ చేశారు. ప్రధాని మోడీ అలీన విధానానికి తిలోదకాలు ఇచ్చి సామ్రాజ్యవాద దేశాలకు పరోక్ష మద్దతునిస్తున్నారని, ఈ వైఖరిని నిరసించాలని వామపక్ష నేతలు పిలుపు నిచ్చారు. యుద్ధం కారణంగా ముడి చమురు ధర పెరుగుతుందని ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయని వారు తెలిపారు. యుద్ధం వద్దు శాంతి ముద్దు అంటూ నినాదించారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఎన్డి నాయకులు రాజేంద్రప్రసాద్ తదితరులు ప్రసంగించగా యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జమ్ముల జితేంద్రరెడ్డి, యర్రాబాబు, నగర కార్యదర్శి ఎస్ కె జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, మేకల శ్రీనివాసరావు, పగడాల మల్లేష్, గాదె లక్ష్మి నారాయణ, ఏనుగు గాంధీ, నూనె శశిధర్, బోడా వీరన్న, రవి, రామకృష్ణ, సిపిఎం నాయకులు వై. విక్రం, పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీను, కళ్యాణం వెంకటేశ్వరరావు, రవీంద్ర నాయక్, మాదినేని రమేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## రేపటి కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేయాలి



**మహబూబాబాద్, అక్టోబర్ 7(మనం న్యూస్):** ఈ నెల 9న హైదరాబాదులోని ఎల్బీ స్టేడియంలో నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అందజేసే నియామక పత్రాల కార్యక్రమానికి వెళ్లేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఈనెల 9వ తేదీన ఎల్.బి స్టేడియంలో జరిగే నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయుల నియామక పత్రాలను అందజేసే కార్యక్రమం పై జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ తో కలిసి, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డి.ఎస్సీ. నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన 376 మంది నూతన ఉపాధ్యాయులకు ఈనెల 9న నియామక పత్రాలను అందజేయడం జరుగుతుందని అందుకు అభ్యర్థులు ఒకరోజు ముందస్తుగా జిల్లా హెడ్ క్వార్టర్ కి వచ్చే విధంగా చూడాలని సూచించారు. వారికి అవసరమైన వసతి ఏర్పాట్లను చేయాలని, అభ్యర్థులను హైదరాబాదు ఎల్.బి స్టేడియంకు చేరవేయడానికి 8 ప్రత్యేక బస్సులు, అల్పాహారం, భోజన సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి బస్సులో ఒక పోలీస్, రెవెన్యు, మెడికల్ సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలని, పర్యవేక్షణకై లైజన్ అధికారులను నియమించాలన్నారు. జిల్లా నుండి బయలుదేరిన బస్సుల ట్రాకింగ్ ప్రక్రియ మొత్తాన్ని చూసుకోవాల్సిందిగా ఈ.డిస్ట్రిక్ మేనేజర్ కు సూచించారు. ఈ సమీక్షలో అదనపు ఎస్పీ చెన్నయ్య, జెడ్.పి.సీ.ఈ.ఓ నర్మద, డి.పి.ఓ హరిప్రసాద్, ట్రైబల్ వేల్ఫేర్ అధికారి సైదా, జిల్లా వైద్యాధికారి డాక్టర్ మురళీధర్, జిల్లా విద్యాధికారి రాజేశ్వరరావు, మహబూబాబాద్ తహసీల్దార్ భగవాన్ రెడ్డి, ఈ.డిస్ట్రిక్ట్ మేనేజర్ ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ చీరలు లేవాయే..

**వీణవంక, అక్టోబర్ 7(మనం న్యూస్) :** తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వ ము గత కొన్ని సంవత్సరాలుగా ఆడ పడుచులకు బతుకమ్మ పండుగ కానుకగా చీరలు పంపిణీ చేసేది. ము ఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈసారి బతు కమ్మ చీరలకు బదులుగా ప్రతి మహిళకు ఐదువందల రూపాయల నగదు ఇవ్వబోతున్నట్లు ప్రకటించిన విషయం విధితమే. ఈ సారి రాష్ట్ర ప్రభు త్వం బతుకమ్మ పండుగకు చీరలు పంపిణీ చేయలేదు. .. కనీసం పైసలు ఇవ్వకపాయే అని మండలంలోని అనేక గ్రామాల మహిళలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మనం
Follow : @Manamnews



# తప్పుడు ఆరోపణలు సరికాదు

• చంద్రగిరి సంపత్

**మల్హర్,అక్టోబర్ 07(మనం న్యూస్) :** ఉండటానికి జాగిస్తే ఆ జాగే తమది అనడం సరి కాదని దళిత నాయకుడు సంపత్ అన్నారు. మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన ఫణిరాజారావు తమ తాతల తండ్రుల నుంచి వస్తున్న సొంత భూమి లో చిన్నపల్లి రమాదేవి . చిన్నపల్లి రాజేశ్వరి సాంబయ్యలు గత కొద్దిరోజుల క్రితం కూరగాయలు పెట్టేందుకు స్థలము ఇవ్వమని నారాయణరావును అడగగా ఖాళీగా ఉందని కూరగాయలు అమ్ముకొని బతికేందుకు వారికి అనుమతిచ్చారు. దీనితో వారు అట్టి భూమిలో పందిరి లాగా వేసుకొని కూరగాయలు గాజులు అమ్ముకొని జీవిస్తున్న రు. ఇదే అదునుగా తీసుకొని కొద్ది రోజులు నుండి భూమిలో ఉంటున్నామని మాదే భూమని దబాయిస్తూ గ్రామానికి సంబంధం లేని కొందరు నాయకులతో ప్రెస్ మీట్ లు ఏర్పాటు చేసి వికలాంగులు దళితుల భూములు లాక్కుంటున్న దొరలపై చర్యలు తీసుకోమంటూ కేసులు పెట్టడం సరైనది కాదని గ్రామంలో ఉన్న దళిత నాయకులు ఎమ్మార్పీఎస్ నాయకులు గ్రామ పెద్దలు సోమవారం విలేకరుల సమావేశంలో తీవ్రంగా ఖండి చారు. గతంలో బతుకుదెరువు కోసం రుద్రారం వచ్చిన రాజేశ్వరి రమాదేవిలకు నిలబడేందుకు నీడనిస్తే కబ్జాలు చేయడం సరైనది కాదని ఆరోపించారు. గ్రామంలో జరిగే విషయాలను గ్రామంతో సంబంధం లేని నాయకులు గ్రామానికి వచ్చినప్పుడు గ్రామంలో ఉన్నటువంటి దళిత వివిధ కుల సంఘ నాయకులను నాయకులను విచారణ చేయకుండా వికలాంగులైనటువంటి భూములను లాక్కోవడం దొరల పెత్తనం అంటూ కేసులు పెట్టించడం సరైనది కాదని అన్నారు. రాష్ట్రంలోనే పేరు మోసినటువంటి ఎమ్మార్పీఎస్ కు చెడ్డ పేరు తెచ్చేటటువంటి తెలిసి తెలియని ఆరోపణ చేయడం సరైనది కాదని సంపత్ తీవ్రంగా ఖండించారు. ఏది ఏమైనప్పటికీ గ్రామంలో ఉన్నటువంటి ఎమ్మార్పీఎస్ దళిత నాయకుల్ని విచారణ తర్వాతనే ప్రెస్ మీట్ పెట్టాల్సి ఉండేదని ఆయన అన్నారు. గతంలో మా తాత తండ్రుల నుండి ఈ భూమి దొరలదేనని వారు ఎంతోమందికి సహాయం చేసే గుణం వారి కుటుంబానికి ఉందని ఆయన మరొక్కసారి గుర్తు చేశారు. ఇకనైనా పని రాజారావు పై పెట్టిన కేసు ను ఎత్తివేస్తూ ఎస్సై పై చేసిన ఆరోపణలు సరైంది కాదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు లక్ష్మీరాజ్యం చంద్రమోహన్, భోగే మల్లయ్య,సంఘం రమేష్ , దళిత నాయకులు కన్నూరి రమేష్,ఎమ్మార్పీఎస్ మాజీ కార్యదర్శి కంబాల శంకర్, మండల నాయకులు కడారి మల్లయ్య,రవి,రాజేందర్ నాయక్,గ్రామస్తులు పాల్గొన్నారు.





## ఫిర్యాదులు పునరావృతం కాకుండా పని చేయాలి

• ఎస్పీ కిరణ్ ఖరే



**భూపాలపల్లి,అక్టోబర్ 07(మనం న్యూస్):** ఎ ప్రజల పిర్యాదులు పునరావృతం కాకుండా సమర్థవంతంగా పనిచేయాలని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యా లయ ంలోని ప్రజాదివాస్ కార్యక్రమంలో భాగంగా బాధితుల నుం చి 17 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా సమస్యలను పరిష్కరించేం దుకు సంబంధిత అధికారులతో ఎస్పీ మాట్లాడారు. చట్టపరిధిలోని సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, ఫిర్యాదులు పునరా వృతం కాకుండా చూడాలని, ఫిర్యాదుదారులపట్ల నిర్లక్ష్యంగా వ్యవ హరించరాదని అన్నారు. అలాగే పెండింగ్ లో ఉన్నా వివిధ పిటిష న్లపై తన కార్యాలయానికి రిపోర్ట్ పంపించాలని పోలీసు అధికారుల ను ఆదేశించారు.

## ఎస్సీ వర్గీకరణ లేకుండా భర్తీ చేయడం మాదిగలకు సీఎం ద్రోహం చేసినట్టే



**చేవెళ్ల,అక్టోబర్ 07(మనం న్యూస్) :** మాదిగల పట్ల సీఎం రేవంత్ రెడ్డి వైఖరి దారుణంగా ఉందని రంగారెడ్డి జిల్లా ఎమ్మా ర్పీఎస్ అధ్యక్షులు కార్యాల ప్రవీణ్ ఆరోపించారు.రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం కేంద్రంలో సోమవారం పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడు తూ సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించి ఇచ్చిన ప్రతి నోటిఫికేషన్ లో ఎస్సీ వర్గీకరణ చేస్తా మని అసెంబ్లీలో హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి 11062 టీచర్ పోస్టు లను ఎస్సీ వర్గీకరణ లేకుండా అమలు చేయడం పట్ల మాదిగ జాతి కి నమ్మకద్రోహం చేయడమే అవుతుందని పేర్కొన్నారు. 30 ఏళ్ల పోరాటం ద్వారా త్యాగా లు చేసి ఎస్సీ ఎస్సీ వర్గీకరణను సాధించు కుంటే ఆ ఫలాలను మాది గలకు అందకుండా రేవంత్ రెడ్డి కుట్ర చేయడం దారుణమని అన్నారు. మాల నాయకుల బ్లాక్మెయిల్ కు రేవంత్ రెడ్డి భయపడుతున్నారని దీనికి భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఏ నెల 9నా మాదిగ విద్యార్థులు నిరుద్యో గులు పెద్ద ఎత్తు న రోడ్లమీదకి వచ్చి ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. అన్ని జిల్లాలలో అంబేద్కర్ విగ్రహాల వద్ద నుండి కలెక్టర్ కార్యాలయాల వరకు నల్లజెండాలతో శంషాబా ద్ లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమా నికి నిరుద్యోగులు, విద్యావంతు లు, పాల్గొని జయ ప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## విద్యుత్ షాక్ తగిలి వ్యక్తి మృతి



**చేవెళ్ల, అక్టోబర్ 07(మనం న్యూస్ ) :** విద్యుత్ పరమత్తులు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి కి షాక్ తగిలి మృతి చెందిన సంఘ టన రంగా రెడ్డి జిల్లా,చేవెళ్ల మండల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు తల్లారం గ్రామపం చాయతీకి అనుబంధ గ్రామం దుద్దాగుగ్రామానికి చెందిన గూడెం బచ్చమ్మ దంపతులకుకు 4వ సంతానం గూడెం శ్రీనివాస్ వయస్సు (42). గత మూడు సంవత్సరాలుగా సన్ని వెంచర్ లో ఉద్యోగ విధు లు నిర్వహిస్తూ తన కుటుంబాన్ని పోషిస్తూ జీవన కొనసాగిస్తున్నా రు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం సుమారు 8:30ని.. లకు వెంచర్ లోని విద్యుత్ మరమ్మ త్తులు నిర్వహిస్తున్న తరుణంలో షాక్ తగిలి ప్రాణాపాయ స్థితి లో కొట్టుమిట్టడుతుండగా మెరుగైన వైద్యం కోసం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు.సంఘటన స్థలంలో బంధువులు కన్నీటిశోకంలో మునిగి పోయారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు బిట్టు, ఆకాష్ లు వున్నారు.

## చండీ దేవికి కుంకుమ పూజ



**తిరుమలగిరి, అక్టోబర్ 7 (మనం న్యూస్) :** తిరుమలగిరి మున్సిపాలిటి కేంద్రం తెలంగాణ చౌరస్తాలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మహా చండీ దేవి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారికి ప్రత్యేకంగా కుంకుమ పూజ నిర్వహించారు. మహిళా భక్తులు పసుపు, కుంకుమ, నైవేద్యాలు, మంగళహారతులతో పూజలు నిర్వహించారు.

## శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అన్నదానం



**నాగారం, అక్టోబర్ 7(మనం న్యూస్):** నాగారం మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లి గ్రామంలో దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం జక్కుల పుల్లయ్య-మౌనిక దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో శీల వీరమల్లు, భద్రయ్య, కృష్ణమూర్తి, స్వామి, రవీందర్, నివాస్,అజయ్,మహేందర్,మున్నా,శివ తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



**భూపాలపల్లి,అక్టోబర్ 07(మనం న్యూస్) :** సమస్య పరిష్కారం కోరుతూ ప్రజలు ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికిఅధికారులు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ శర్మ అన్ని శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయపు సమావేశపు హాలులో అన్ని శాఖల జిల్లా అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి సమస్యల దరఖాస్తులు స్వీకరించి తగు చర్యలు నిమిత్తం సంబంధిత అధికారులకు ఎండార్స్మెంట్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులకు ఎండార్స్మెంట్ చేసిన, దరఖాస్తులు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తును నిశిత పరిశీలన చేయాలని, తదుపరి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజావాణిలో 44 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఇప్పటి వరకు ప్రజావాణిలో మొత్తం 383 దరఖాస్తులు రాగా 205 పరిష్కరించారని 183 దరఖాస్తులు పెండింగులో ఉన్నట్లు తెలిపారు. వచ్చే వారం తహసీల్దార్లు, అన్ని శాఖల జిల్లా అధికారులు ఇప్పటి వరకు ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పరిష్కరించబడినవి, పెండింగ్ పై నివేదికలు అందచేయాలని ఆదేశించారు. ప్రజావాణిలో సందర్భంగా మహాముత్తారం గ్రామ రైతులు బీరెల్లి జలంధర్, అంకయ్య, రాజమణి పోలారం గ్రామ రెవెన్యూ శివారిలో 8 ఎకరాల్లో పామాయిల్ తోట మూడు సంవత్సరాల నుండి సాగు చేస్తున్నామని, అనివార్య కారణాలవల్ల బోరుబావి పాడైపోయిందని పామాయిల్ తోటకు నీరు లేక ఎండిపోతున్నదని మరలా బోరు వేసుకోవడానికి అటవీ అధికారులు అడ్డుపడుతున్నారని, బోరు వేసుకోవడానికి అటవీశాఖ ద్వారా అనుమతి ఇప్పించాలని చేసిన దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యలు నిమిత్తం అటవీ శాఖ అధికారికి ఎండార్స్మెంట్ చేశారు. కాటారం మండలం : కాటారం గ్రామ పంచాయతీ చెందిన రామిల్ల రాజబాబు కాటారం సబ్ డివిజన్ పరిధిలోని మండలాల్లో వైన్ షాపుల్లో బ్రాండెడ్ బీర్లు, క్వార్టర్లు కౌంటర్లో ఇవ్వకుండా స్టిక్కరింగ్ చేసి 20 రూపాయలు అదనంగా బెల్టు షాపులకు విక్రయిన్నారని, బెల్ట్ షాప్ నిర్వాహకులు 30 నుండి 40 రూపాయల వరకు అదనంగా విక్రయిస్తున్నారని విచారణ నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని చేసిన దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తనిఖీలు నిర్వహించాలని నిర్దేశిత ధరల కంటే అదనపు ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అబ్కారీ ఈ ఎస్ ను ఆదేశించారు.ఇప్పనపల్లి గ్రామం : మొగుళ్లపల్లి మండలానికి చెందిన కేతపల్లి సమ్మిరెడ్డి అక్కినపల్లి శివారు సర్వేనెంబర్ 281 లో 10 కుష్కి భూమి ఉందని, అట్టి భూమిలో పత్తి పంట సేద్యం చేస్తున్నానని అర్ధరాత్రి పత్తి పంటను ట్రాక్టర్ తో పూర్తిగా ధ్వంసం చేశారని ఇట్టి విషయమై మొగుళ్ళపల్లి పోలీస్ స్టేషన్ లోను, తహసిల్దార్ కి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదని విచారణ నిర్వహించి తగు చర్యలు చేపట్టాలని అలాగే తన భూమి ప్రక్కన అక్రమ నిర్మాణం చేస్తున్న వ్యక్తిపై తగు చర్యలు తీసుకోవాలని చేసిన ఫిర్యాదును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యలు నిమిత్తం సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడికి ఎండార్స్మెంట్ చేశారు. మహాదేవపూర్ మండలం బొమ్మపూర్ గ్రామానికి చెందిన భాను రెడ్డి రెండు లక్షల పైనున్నటువంటి రుణం చెల్లింపు చేశానని తనకు ఇపుడు రెండు లక్షల్లోపు రుణం ఉన్నందున రుణమాఫీ చేయాలని చేసిన ఫిర్యాదును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యలు నిమిత్తం జిల్లా వ్యవసాయ అధికారికి ఎండార్స్మెంట్ చేశారు. భూపాలపల్లి మండలం ఆకుదారివాడ గ్రామానికి చెందిన బుర్ర చంద్రయ్య భూపాలపల్లి శివారు సర్వే నంబర్ 325/బి నందు ఆర్ ఓ ఆర్ ద్వారా పట్టా కలిగిన 0.04 1/2 గుంటల భూమి కలదని తనకు తెలియ కుండా ఇతరుల పేరున కంప్యూటర్ పహానిలో నమోదు చేశారని, విచారణ నిర్వహించి యధావిధిగా తన పేరు నమోదు చేయాలని చేసిన దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ విచారణ నిర్వహించి నివేదిక అందచేయాలని భూపాలపల్లి తహసీల్దార్ కు ఎండార్స్మెంట్ చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దశాబ్దాలు గడిచినా ఎరుపు తగ్గలే

**మహా ముత్తారం,అక్టోబర్ 07(మనం న్యూస్):** ఎ దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఎర్రజెండా అనేక దశాబ్దాలు గడిచిన విస్తరిస్తూ ఎరిపెక్కుతుందే తప్ప తగ్గడం లేదని సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యు డు పొలం రాజేందర్,జిల్లా కమిటీ సభ్యుడు ఆత్కూరి శ్రీకాంత్ అన్నారు. సోమవారం మహా ముత్తారం మండలంలోని పోలంపల్లి గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు సిపిఐ ఎం పార్టీ ద్వితీయ మండల మహాసభలు జరిగినాయి, ఈ మహాసభలకు మానేటి బాబు , కుంజం బుధవారం బొడ్డు సునీత అధ్యక్షత వహించారు.మండల మహాసభకు ముఖ్య అతిథులుగా హాజరైన పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పోలం రాజేందర్ ఆత్కూరి శ్రీకాంత్ మాట్లాడుతూ భారతదేశంలో అనేక బుర్జువ భూస్వామ్య పార్టీలు ఎర్రజెండాను అంతం చేయడానికి అనేక కుట్రలు కుతంత్రాలు పన్నిన, ఆ దాడిని తట్టుకొని, ఎర్రజెండా పట్టణ ప్రాంతాలను మొదులుకొని అనేక మార్మూల ప్రాంతాలకు విస్తరిస్తూ ఎరిపెక్కుతుంది తప్ప తగ్గడం లేదని, ఎర్రజెండాను నిలువరించడం ఎవరి తరం కాదని, దోపిడి అణిచివేత సామాజిక అంతరాలు ఉన్నంతకాలం ఎర్రజెండా ప్రజల గుండెల్లో పదిలంగా ఉంటుందన్నారు. ప్రకృతిలో సమస్త జీవరాశి మానవాళి బాగుండాలి అంటే ఎర్రజెండా రాజ్యంతోనే సాధ్యమని అన్నరు అదేవిధంగా పెట్టుబడి దారి వర్గ మతోన్మాద బీజేపీ చేతిలో రాజ్యం ఉన్నంతకాలం పకృతి విధ్వంసం చేస్తూ సహజ వనరులను ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతూ ప్రభుత్వ రంగాలను ఖూనీ చేస్తూ ప్రజల సకల సమస్యలకు కారణమవుతున్నాయని అట్లాంటి పార్టీల చేతిలో అధికారం ఉన్నంతకాలం దేశ సంపద ప్రజలకు సమానంగా పంచబడదని ప్రజల మధ్య ఆర్థిక అసమానతలు అంతరాలు పెరుగుతూనే ఉంటాయన్నారు, ప్రజల కొనుగోలు శక్తి తగ్గడం సరుకుల ధరలు విపరీతంగా పెరగడం ఈ ప్రక్రియ నిరంతరం జరుగుతూనే ఉంటుందని అందుకే ఇలాంటి కార్మిక కర్షక మహిళ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న పెట్టుబడిదారీ మతోన్మాద బిజెపి పార్టీలను 100 అడుగుల గొయ్యి తీసి పాతి పెట్టే విధంగా ప్రజలను చైతన్యం చేయాలని మహా సభ ప్రతినిధులకు సూచించారు. అదే విధంగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలు ఆరు గ్యారంటీలు అమలు చేయాలని మహాసభ నుండి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పోలం చిన్న రాజేందర్, రాధారం మల్లయ్య, మడకం భద్రయ్య సోడి ఉంగమ్మ గట్టు శంకర్, సకినాల మల్లేష్ ఇప్పలపల్లి దేవేందర్ మాడవి మాడ,గొరిగా పద్మ ,గడ్డం రమేష్ మహాసభ ప్రతినిధులు ఉన్నారు.



## ప్రజల రవాణా సౌకర్యార్థం సొంత నిధులు వెచ్చించి రోడ్డు మరమ్మతులు



• ముడిమ్యాల పిఎసిఎస్ చైర్మన్ గోనె ప్రతాపరెడ్డి

**చేవెళ్ల, అక్టోబర్ 07(మనం న్యూస్):** తన స్వగ్రామం అయిన ముడిమ్యాల గ్రామ బిటి రోడ్డు భారీ గుంతలు గా మారాయని అనునిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని సహృదయంతో సొంత నిధులు వెచ్చించి రోడ్డుకు ఇరువైపులా మొరం పోయించి సీసీ తో మరమ్మత్తులు నిర్వహించినట్లు ముడిమ్యాల పిఏసిఎస్ చైర్మన్ గోనె ప్రతాపరెడ్డి పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలోని ముడిమ్యాల గ్రామపంచాయతీ పరిధిలో బీజాపూర్ రహదారి నుండి గ్రామానికి వెళ్లే బీటీ రోడ్ పూర్తిగా గుంతల మయంగా మారిందని అన్నారు ఈ సందర్భంగా అయన మాటాడుతూ అనునిత్యం వాహన దారులు ఉద్యోగరీత్యా, వ్యవసాయ రిత్యా, వ్యాపారాల రీత్యా వెళ్లే వాహనదారులు ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని గ్రహించి పలు సార్లు ప్రమాదాలు కూడా చోటు చేసుకున్నాయన్నా విషయానికి కలత చెందానని గ్రామ ప్రజలు సురక్షితనంగా తమ తమ గమ్యాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తూ తన వంతు బాధ్యత గా కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమం లో గ్రామ మాజీ సర్పంచ్ పడాల ప్రభాకర్,మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు ఎండి వాజీద్, మాజీ ఎంపిటిసి బోర్ల సాయినాథ్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కోశాధికారి యంజాల వినోద్, నేతలు కాజా మొయినిద్దీన్,గోనే జంగారెడ్డి, మల్గాని సత్యం, ఎండి ఆఫీస్, గౌడిచర్ల మాణిక్యం, శ్రీనివాస్,చాన్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ సెలూన్స్‌పై చర్యలు తీసుకోవాలి

**రంగారెడ్డి, అక్టోబర్ 07(మనం న్యూస్) :** క్షౌరవృత్తిపై దుష్ప్రచారం చేస్తున్న కార్పొరేట్ సెలూన్స్‌పై చర్యలు తీసుకోవాలి అని క్షౌర వృత్తిదారు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెన్నారం మల్లేష్ అన్నారు. సోమవారం చైతన్యపురి డివిజన్‌లో నాయి బ్రాహ్మణుల క్షౌర వృత్తి రేట్లపై జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మల్లేష్ హాజరై మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో పెద్ద పెద్ద పట్టణాలలో కార్పొరేట్ సెలూన్స్ ప్రవేశించి అక్కడ 30 ,40 సంవత్సరాల నుండిపని చేస్తున్న మాషాపుల రేట్ల ధర తగ్గించి క్షవరం చేసి మా వృత్తిని దెబ్బతీస్తున్నారు.మా కుటుంబాలను రోడ్డు పాలు చేస్తున్నారు. కస్టమర్లకు మేము మాలిష్ చేస్తే పెరాల్సిస్ వస్తుందని అబద్ధాలు చెప్పి మా మాపై మా క్షౌరవృత్తిపై దుష్ప్రచారం చేస్తున్నారు .ఈ కార్పొరేట్ సెలూన్స్ పై ప్రభుత్వం చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మా వృత్తిదారులను ఆదుకోవాలి క్షౌర వృత్తికి రక్షణ కల్పించాలి అని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు గోల్కొండ అశోక్ రాష్ట్ర నాయకులు నెలకంటి చంద్రయ్య ,దయానంద్, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు దేవరకొండ, శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దేవి నవరాత్రి ఉత్సవాలు

• అమ్మవారి సేవలో పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా

**రంగారెడ్డి, అక్టోబర్ 07(మనం న్యూస్) :** దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నాగోల్ లోని మమత నగర్ లో జరిగిన అమ్మ వారి మండపం లో పాల్గొన్న టి పిసిసి ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ , రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూదేశ వ్యాప్తంగా ప్రజలు ఎంతో భక్తి శ్రద్ధలతో అమ్మవారి పూజ ల్లో పాల్గొంటారు అని ఆయన అన్నారు. ఆ మాత అనుగ్రహముతో అందరూ సంతోషంగా సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షిం చారు. దేవి అమ్మవారి సేవలో ప్రతీ ఒక్కరూ నిమగ్నం కావాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో నాగేందర్ గౌడ్, ప్రవీణ్ గుప్త, రాము, రాజు దేవి నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక పూజల్లో పాల్గొన్న దేప భాస్కర్ రెడ్డి

**రంగారెడ్డి,అక్టోబర్ 07(మనం న్యూస్) :** మహేశ్వరం నియోజకవర్గం జల్ పల్లి మున్సిపాలిటీ శ్రీరామ్ నగర్ కాలనీ లోని శివాలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన కనకదుర్గమ్మ అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలలో పాల్గొన్న మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు మన్న రవి కుమార్, కౌన్సిలర్ యాదగిరి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పందుల వెంకటేష్ గౌడ్, కందుకూరు మండలం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నరసింహ చారి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## విజయ దుర్గా ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు

**రంగారెడ్డి, అక్టోబర్ 7(మనం న్యూస్) :** సరూర్ నగర్ డివిజన్ పంజాల అనిల్ కుమార్ కాలనీలో నెలకొని ఉన్న విజయ దుర్గా దేవాలయంలో దేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా సోమవారం అమ్మవారిని చండి దేవి రూపంలో అలంకరించి అభిషేకం అర్చన వంటి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మ కర్తలు ఇంటూరి విద్యా అంకి రెడ్డి, చిలుకూరు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కాలేజీ ప్రిన్సిపాల్ వెంపటి అశోక్ బాబు, విజయలక్ష్మి ,తదితరులు పాల్గొన్నారు.

# నక్సలైట్లతో అంతిమ యుద్ధం



న్యూఢిల్లీ, అక్టోబర్ 7 (మనం న్యూస్): మావోయిస్టు తీవ్రవాదం తుదిదశకు చేరుకుందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలపై కేంద్రం దృష్టిపెట్టినట్లు తెలిపారు. అమిత్ షా అధ్యక్షతన మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల సీఎంల సదస్సు ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ప్రారంభమైంది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మావోయిస్టు తీవ్రవాదం అంతం కోసం అన్ని రాష్ట్రాలు సహకరించాలని పిలుపునిచ్చారు. దేశంలో మావోయిస్టు తీవ్రవాదం తుదిదశకు చేరింది. మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఇప్పటివరకు 13 వేల మందికి పైగా మావోయిస్టులు ఆయుధాలు వదిలేశారు. 2024లో 202 మంది మావోయిస్టులు మృతిచెందగా.. 723 మంది లొంగిపోయారు. భవిష్యత్తులో మరింత స్ఫూర్తితో ఒకే లక్ష్యంతో ముందుకెళ్లాలి. ఛత్తీస్‌గఢ్ విజయం అందరికీ ప్రేరణగా నిలుస్తోంది. అక్కడ కొందరు మావోయిస్టులు లొంగిపోయారని అమిత్ షా పేర్కొన్నారు. మావోయిస్టు రహితంగా మార్చేందుకు అన్ని రాష్ట్రాలు సహకరించాలని షా పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఛత్తీస్‌గఢ్ సీఎం, డీజీపీని ఆయన అభినందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల ప్రయోజనాలు ప్రజలకు చేరవేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. పదేళ్లలో మోదీ సర్కార్ చేసిన అభివృద్ధి గురించి వివరించారు. 'పదేళ్లలో 11,500 కిలోమీటర్ల మేర రోడ్ నెట్‌వర్క్‌తో పాటు 15,300 సెల్‌ఫోన్ టవర్లను ఏర్పాటుచేశాం. 165 ఏకలవ్య ఆదర్శ పాఠశాలలు ఏర్పాటుచేశాం. గతంలో హింసాత్మక ఘటనలు 16,400కు పైగా జరిగాయి. ప్రస్తుతం ఇలాంటి ఘటనలు 7,700లకు తగ్గాయని వెల్లడించారు. పౌరులు, భద్రతా బలగాల మరణాలు 70 శాతం తగ్గాయి. హింస ప్రభావిత జిల్లాలు 96 నుంచి 42కు తగ్గాయి. హింసాత్మక ఘటనలు నమోదయ్యే పోలీసుస్టేషన్ల సంఖ్య 465 నుంచి 171కి తగ్గింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతోనే ఇది సాధ్యమైందని అమిత్ షా పేర్కొన్నారు.హింస మార్గంలో ఏం సాధించలేమని.. జన జీవన స్రవంతిలో కలవాలని మావోయిస్టులకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. హింస మార్గాన్ని వీడే మావోయిస్టుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. వాటిని వినియోగించుకుని ప్రజల్లోకి రావాలని మావోయిస్టులకు ఈ సందర్భంగా కేంద్ర మంత్రి అమిత్ షా సూచించారు. ఈ సమావేశంలో 2023, మార్చి 31వ తేదీ నాటికి దేశంలో నక్సలిజం అంతం, అర్బన్ నక్సల్స్ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. మావోయిస్టు కార్యకలాపాలను కట్టడి చేయడంతో పాటు పోలీస్ సామర్థ్యాన్ని పెంపొందించడంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర చాలా బాగా పనిచేశాయని ఆయన పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం వికసిత భారత్ లక్ష్యంగా పని చేస్తుందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అయితే వికసిత భారత్ సాధించాలంటే గిరిజనులు, ఆదివాసీలు సైతం అందులో భాగస్వామ్యం కావాలన్నారు. కానీ ప్రభుత్వ ఫలాలు గిరిజనులు, ఆదివాసీలకు అందకుండా మావోయిస్టులు అడ్డుకుంటున్నారని కేంద్ర మంత్రి అమిత్ షా మండిపడ్డారు. రహదారులు, టవర్లు, చివరకు విద్య, వైద్యం సైతం వీరికి చేరనివ్వడం లేదన్నారు. అయితే గత కొన్నేళ్లుగా మావోయిస్టు సమస్యను ఎదుర్కొనే విషయంలో మోదీ సర్కార్ గణనీయమైన పురోగతి సాధించిందని ఆయన పేర్కొన్నారు. 2022లో తొలి సారి మావోయిస్టు హింస కారణంగా జరిగిన మరణాల సంఖ్య 100కంటే తక్కువ నమోదయిందని వివరించారు. అలాగే మావోయిస్టుల ప్రభావిత గిరిజన ఆదివాసీ ప్రాంతాలకు ప్రభుత్వ ఫలాలు, పథకాలు సైతం వేగంగా చేరుతున్నాయని తెలిపారు. మావోయిస్టుల సమస్యను అధిగమించేందుకు బహుముఖ వ్యూహాన్ని సైతం అమలు చేస్తున్నామన్నారు. దీంతో ఈ సమస్యను చాలా సమర్థవంతంగా ఎదుర్కొంటున్నామని చెప్పారు. ఈ క్రమంలో వివిధ రాష్ట్రాల పోలీస్ విభాగాలు సైతం చాలా బాగా పని చేస్తున్నాయన్నారు. ఇక ఎన్‌కౌంటర్‌లలో గాయపడిన భద్రత బలగాలను త్వరితగతిన వైద్య చికిత్స అందించేందుకు హెలికాప్టర్ సేవలను వినియోగిస్తున్నామని గుర్తు చేశారు. అయితే ఈ ఏడాది ఛత్తీస్‌గఢ్‌లో వామపక్ష తీవ్రవాదంపై పైచేయి సాధించామని హోం మంత్రి అమిత్ షా ఈ సందర్భంగా వివరించారు. ఈ సమీక్షా సమావేశానికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితోపాటు ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఇక ఆంధ్రప్రదేశ్ నుంచి హోంశాఖ మంత్రి వంగలపూడి అనితతోపాటు డీజీపీ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. అలాగే జార్ఖండ్, బిహార్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. మరోవైపు భవిష్యత్తులో వామపక్ష తీవ్రవాదం దేశానికి ముప్పుగా పరిణమిస్తుందని కేంద్రంలోని మోదీ సర్కార్ భావిస్తుంది. ఆ క్రమంలో వామపక్ష తీవ్రవాదాన్ని అంతం చేసేందుక చర్యలు చేపట్టింది. ఆ క్రమంలో దశాబ్దాల క్రితం నేపాల్ నుంచి ఆంధప్రదేశ్ వరకు పశుపతి టూ తిరుపతి కారిడార్ ఏర్పాటు చేసేందుకు మావోయిస్టులు ఉపక్రమించారు. అయితే దీనిని సైతం మోదీ సర్కార్ ధ్వంసం చేసిన విషయాన్ని ఇటీవల కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఇంకోవైపు సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 20వ తేదీ వరకు మావోయిస్టులు వార్షికోత్సవాలు జరపాలంటూ కేడర్‌కు పిలుపు నిచ్చింది. అలాంటి వేళ.. ఛత్తీస్‌గఢ్‌లో శనివారం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో దాదాపు 35 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇక ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఏరివేతకు భద్రత దళాలు ముమ్మర చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ సరిహద్దు రాష్ట్రాల్లోకి వెళ్లకుండా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు గట్టి చర్యలు తీసుకున్నాయి. అం దులో భాగంగా ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల వద్ద భారీగా భద్రతా దళాలను మోహరించారు.

నక్సలైట్లతో యుద్ధం అంతిమ దశలో ఉందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి సమాజంలోని చివరి వ్యక్తికీ చేరాలంటే నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించడం అవసరమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. రాష్ట్రాల సహకారంతో 2026 మార్చి నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించగమని విశ్వాసం వ్యక్తం చేశారు. గత కొద్ది సంవత్సరాల్లో 24 మంది నక్సల్ అగ్రనేతలతో పాటు ఎన్నో దళాలను మట్టుబెట్టామన్నారు. రెండు రోజుల క్రితం 31మంది మావోయిస్టుల ఏరివేతను ఆయన ప్రస్తావిస్తూ త్వరలోనే ఛత్తీసగఢ్ మావోయిస్టు రహిత రాష్ట్రంగా ఆవిర్భవించబోతోందని చెప్పారు.

వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో టెలీ కమ్యూనికేషన్లు, ఆరోగ్య సౌకర్యాలు, విద్య, తాగు నీరు వంటి కనీస మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్న ఆయన పదేళ్లలో 544 దుర్భేద్యమైన పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేశామన్నారు. 14,400 కిలోమీటర్ల రహదారులు నిర్మించామని, 6 వేల మొబైల్ టవర్లు, 165 ఏకలవ్య స్కూళ్లను ఏర్పాటు చేశామని షా చెప్పారు. ఆపరేషన్ కగార్ పేరిట నక్సల్స్ ఏరివేత కార్యక్రమాలు కొనసాగుతున్న తీరును ఈ సమావేశంలో సమీక్షించారు.



## బహుజన హక్కులు కాపాడతాం

న్యూఢిల్లీ, అక్టోబరు 7: భారత రాజ్యాంగాన్ని కాంగ్రెస్ పార్టీ పరిరక్షిస్తుందని, రాజ్యాంగం ద్వారా బహుజనులకు లభించిన హక్కులను కాపాడుతుందని ఆ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీ ఉద్ఘాటించారు. అయితే, సమాజంలోని ప్రతి ఒక్కరూ సోదరభావ స్ఫూర్తితో మెలిగినప్పుడే రాజ్యాంగం ప్రసాదించిన సమానత్వం, హక్కులు ప్రతి ఒక్కరికీ లభిస్తాయని తెలిపారు. రాహుల్‌గాంధీ ఇటీవల దళిత కుటుంబంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారితో కలిసి వంట చేశారు. ఈ నేపథ్యాన్ని పురస్కరించుకుని సోమవారం సోషల్ మీడియాలో ఆయన వీడియోను పంచుకున్నారు. 'దళితుల వంటిల్లు ఎలా ఉంటుందనేది ఇప్పటికీ చాలా తక్కువ మందికే తెలుసు. దళితులు ఏం తింటారో ఎవరికీ తెలియదు. అసలు వారేం తింటారో? ఏం వండుకుంటారో? సామాజిక, రాజకీయ కోణంలో చూసినప్పుడు చాలా ఆసక్తిగా ఉంది. ఒక రోజు మధ్యాహ్నం మహారాష్ట్రలోని కొల్హాపూర్లో ఉన్న అజయ్ తుకారాం సనాదే, అంజనా తుకారాం సనాదేలతో గడిపాను. ఆ సమయంలో వారుచేస్తున్న వంటలో సాయం చేశాను. అందరం కలిసి శనగలతో కూర చేశాం. వంకాయ, ఆకుకూరలతో పప్పు చేశాం' అని రాహుల్ తన వీడియోలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆ కుటుంబంతో అనేక విషయాలు పంచుకున్నానని తెలిపారు. అంజనా తుకారం కుటుంబం చెప్పిన దానిని బట్టి వారు ఇప్పటికీ కుల, సామాజిక వివక్షకు గురవుతూనే ఉన్నారని తెలిసిందన్నారు. కాగా, ఈ వీడియోలో దళిత కుటుంబంతో కలిసి రాహుల్ గాంధీ వంట చేయడంతోపాటు, వారితో కలిసి భోజనం చేస్తున్న దృశ్యాలు ఉన్నాయి.

## కాంగ్రెస్ విజయం ఖాయం

చెన్నై, అక్టోబర్ 7 : హర్యానా, జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ నెలకొన్న నేపథ్యంలో గెలుపెవరిదో కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం తేల్చిచెప్పారు. కాంగ్రెస్ చిరకాల విధానాలను ప్రజామోదం కనిపిస్తోందన్నారు. హర్యానాలో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని, జమ్మూకశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుందని ధీమా వ్యక్తం చేశారు. చిరకాలంగా కాంగ్రెస్ పార్టీ ఏ విధానాలకు కట్టుబడి ఉందో వాటిని ప్రజలు ఆమోదించనున్నారు. కొద్దికాలం వేరే వాళ్ల సిద్ధాంతాలు, విధానాలు గెలిచినట్టు కనిపించ వచ్చు. అయితే దీర్ఘకాలంలో కాంగ్రెస్ పార్టీ విధానాలు, సిద్ధాంతాలకు ప్రజామోదం ఉంటుంది. నా వాదనకు హర్యానా, జమ్మూకశ్మీర్ ఎన్నికల ఫలితాలే బలం చేకూరుస్తాయని ఆశిస్తున్నాను' అని చిదంబరం అన్నారు. చెన్నై ఎయిర్ షో సందర్భంగా తీవ్ర ఉష్ణోగ్రతలు, ఇతర మెడికల్ కండిషన్ల కారణంగా ఐదుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోవడం దురదృష్ట కరమని చిదంబరం అన్నారు. మృతుల కుటుంబాలకు తమిళనాడు ప్రభుత్వం పెద్దమనసుతో పరిహారం ఇస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పారు. కాగా, హర్యానా, జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అక్టోబర్ 8వ తేదీన వెలువడనున్నాను. హర్యానాలో కాంగ్రెస్ విజయం ఖాయమని, జమ్మూకశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్‌కాంగ్రెస్ కూటమి తమ ప్రత్యర్థుల కన్నా మెరుగైన ఫలితాలు సాధిస్తుందని పలు ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి.

## కాంగ్రెస్ అంటే అబద్దాల పుట్ట

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 7 (మనం న్యూస్): కాంగ్రెస్ అంటే అబద్దాల పుట్ట అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. అంకెల గారడీతో ప్రజలను మోసం చేయడం కాంగ్రెస్‌కు అలవాటైందన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'రైతుల రుణాలు సగం మాత్రమే మాఫీ అయ్యాయి. రాష్ట్ర రైతులను కాంగ్రెస్ నిట్టనిలువునా ముంచింది. రూ.31వేల కోట్లు మాఫీ చేశామని గతంలో సీఎం చెప్పారు. ప్రధానికి రాసిన లేఖలో రూ.17 వేల కోట్లే మాఫీ చేసినట్లు ప్రస్తావించారు' అని కిషన్‌రెడ్డి విమర్శించారు.



## మాల్దీవుల పర్యటనకు రండి!

మొదటి పేజీతరువాయి...


సమావేశంలో ముయిజ్జు మాట్లాడుతూ ప్రస్తుతం తాము ఎదుర్కొంటున్న విదేశీ మారక సమస్యలను అధిగమించేందుకు భారత్ అందిస్తున్న సహాయసహకారాలు చాలా కీలకంగా మారనున్నాయంటూ కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఆపన్న హస్తం అందించడంలో భారత్ ఎల్లప్పుడూ ముందుంటుందని మోదీ స్పష్టం చేశారు. విదేశాంగ విధానంలో పొరుగువారికే తొలి ప్రాధాన్యం ఇస్తామని నొక్కి చెప్పారు. మాల్దీవులను 'సన్నిహిత మిత్రుడి'గా అభివర్ణించారు. ఆ దేశానికి ఎదురైన అత్యవసర పరిస్థితుల్లోనూ, కొవిడ్ వ్యాక్సిన్ సరఫరా విషయంలోనే ముందుగా స్పందించినది భారతదేశమేనని గుర్తుచేశారు. భారత సాయంతో మాల్దీవుల్లో చేపట్టిన హనిమదూ అంతర్జాతీయ విమానాశ్రయ ఆధునికీకరణ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన నూతన రన్వేను ఇరువురు నేతలు ఈ సందర్భంగా వర్చువల్గా ప్రారంభించారు. దీంతోపాటు మాల్దీవుల్లో రూపేకార్డు ద్వారా చెల్లింపులు జరిపే ప్రక్రియనూ ప్రారంభించారు. తద్వారా భారత పర్యాటకులు మాల్దీవులలో నగదు రహిత చెల్లింపులు చేయడం సులభం కానుంది. విదేశీ మారక నిల్వల సమస్యను మాల్దీవులు అధిగమించేలా రూ.3,359 కోట్లు(400 మిలియన్ డాలర్లు), మరో రూ.3 వేల కోట్ల కరెన్సీ స్వాప్ ఒప్పందాన్ని కూడా ఈ సందర్భంగా ప్రకటించారు.

## 144 మంది అభ్యర్థులు డబ్బులు చెల్లింపు

### నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై సిబిఐ వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 7 : నీట్ యూజీ 2024 పేపర్ లీక్ కేసు దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ కేసును దర్యాప్తులో భాగంగా సీబీఐ కీలక విషయాలు గుర్తించింది. ఈ వ్యవహారంలో మొత్తంగా 144 మంది అభ్యర్థులు డబ్బులు చెల్లించినట్లు తేల్చింది. ఈ కేసుకు సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థ గతవారం మూడో ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. పరీక్ష జరగడానికి కొద్ది గంటల ముందే ఝార్ఖండ్‌లోని హజారీబాగ్‌లోని ఒయాసిస్ స్కూల్ నుంచి పంకజ్ కుమార్ అనే వ్యక్తి చేతుల మీదుగా నీట్ ప్రశ్నాపత్రం లీకైనట్లు సీబీఐ గుర్తించింది. ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ సహకారంతోనే పేపర్ బయటకు వచ్చినట్లు ఛార్జిషీట్‌లో పేర్కొంది. నీట్ పరీక్ష జరిగిన రోజు (మే 5న) ఉదయం 8 గంటలకు ప్రశ్నాపత్రాలు పాఠశాలకు చేరుకున్నాయి. ఆ సమయంలో పరీక్షా కేంద్రానికి కోఆర్డినేటర్‌గా ఉన్న హసనుల్ హక్.. ఐఐటీ జెంషెడ్‌పూర్‌కు చెందిన ఓ సివిల్ ఇంజినీర్‌ను ప్రశ్నాపత్రం బాక్సు ఉన్న గదిలోకి పంపించాడు. ప్రత్యేకమైన టూల్‌కిట్ సాయంతో ఆ పెటటెను తెరిచాడు. ప్రశ్నాపత్రం మొత్తాన్ని ఫొటో తీసుకున్నాడు. అనంతరం దాన్ని యథావిధిగా పెటటెలో పెట్టి మునుపటి మాదిరిగా సీల్ చేశాడు.బయటకు వచ్చిన తర్వాత ఆ క్వశ్చన్ పేపర్‌ను ఓ గెస్ట్‌హౌస్‌లో ఉన్న మరో వ్యక్తికి పంపించాడు. అక్కడున్న తొమ్మిది మంది వైద్య విద్యార్థులు ప్రశ్నాపత్రానికి సమాధానాలు పూర్తిచేశారు. వాటిని వివిధ ప్రాంతాల్లో ఉన్న గ్యాంగ్ సభ్యులకు పంపించారు. అనంతరం డబ్బులు చెల్లించిన అభ్యర్థులకు వాటిని చేరవేసినట్లు సీబీఐ దర్యాప్తులో వెల్లడైంది. ఈ పేపర్ లీకేజీ వ్యవహారం గురించి 298 మంది సాక్షులు, 290 డాక్యుమెంట్లు, 45 మార్గాల్లో లభించిన సమాచారం ఆధారంగా 5500 పేజీల ఛార్జిషీట్‌ను సీబీఐ రూపొందించింది.

## ఫలితాలపై ఉత్కంఠ!



న్యూఢిల్లీ, అక్టోబర్ 7 : జమ్మూ కశ్మీర్, హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నేడు ఉదయం ప్రారంభం కానుంది. అందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. ఈ రెండు రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు జరిగే ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతను సీఈసీ ఏర్పాటు చేసింది. అందుకోసం భారీగా బలగాలను మోహరించింది. మంగళవారం ఉదయం 8.00 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుందని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. భద్రత చర్యల్లో భాగంగా స్థానిక పోలీసులతోపాటు భద్రతా దళాలను మోహరించినట్లు తెలిపింది. అలాగే ఓట్ల లెక్కింపు జరిగే ప్రదేశాల్లో సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేసినట్లు వివరించింది. తొలుత 7.30 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తామని స్పష్టం చేసింది. అనంతరం ఈవీఎంలో నమోదైన ఓట్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని సీఈసీ పేర్కొంది. జమ్మూ కశ్మీర్‌లో మొత్తం 90 అసెంబ్లీ స్థానాలున్నాయి. ఈ అసెంబ్లీ ఎన్నికలు మూడు విడతలుగా.. సెప్టెంబర్ 18, సెప్టెంబర్ 25, అక్టోబర్ 1వ తేదీన జరిగాయి. ఈ ఎన్నికల్లో దాదాపు 60 శాతంపైగా ఓటింగ్ నమోదయింది. దాదాపు దశాబ్దం తర్వాత జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. అదీకూడా ఆర్టికల్ 370 రద్దు అనంతరం జరుగుతున్న తొలి అసెంబ్లీ ఎన్నికలు ఇవి. నేపథ్యంలో జమ్మూ కశ్మీర్ ఓటర్ ఏ పార్టీకి పట్టం కడతాడనే అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇక ఎగ్జిట్ పోల్స్‌లో మాత్రం నేషనల్ కాన్ఫరెన్స్‌తో పొత్తు పెట్టుకున్న కాంగ్రెస్ పార్టీకి విజయావకాశాలున్నాయని స్పష్టం చేశాయి. లేకుంటే రాష్ట్రంలో హాంగ్ ప్రభుత్వం కొలువు తీరే అవకాశముందని పేర్కొంది. ఇక హర్యానాలో సైతం 90 అసెంబ్లీ స్థానాలున్నాయి. ఈ అసెంబ్లీ ఎన్నికలు ఒకే విడతలో అంటే.. అక్టోబర్ 5న జరిగాయి. ఈ ఎన్నికల్లో 60 శాతానికిపైగా పోలింగ్ నమోదయింది. గతంలో హర్యానాలో వరుసగా జరిగిన రెండు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తన సత్తా చాటింది. అయితే ఈ సారి ఎగ్జిట్ పోల్స్ మాత్రం కాంగ్రెస్ పార్టీ అధికార పీఠాన్ని కైవసం చేసుకుంటుందని స్పష్టం చేస్తున్నాయి. ఒక వేళ.. అదే జరిగితే మాత్రం రాష్ట్రంలో హ్యాట్రిక్ విజయాన్ని సొంతం చేసుకుంటామని బీజేపీ అగ్రనేతలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. మరి హర్యానా ఓటరు ఎవరి పట్టం కట్టేది.. బీజేపీకా? లేకుంటే కాంగ్రెస్ పార్టీకా? అనేది మంగళవారం సాయంత్రం నాటికి తెలిపోనుందన్నది సుస్పష్టం. ఈ ఎన్నికల ఫలితాలు వెలువడిన కొద్ది రోజులకే మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు నగరా మోగనుంది. అందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తుంది. ఈ రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు నవంబర్‌లో జరిగే అవకాశముందని సమాచారం.

## సింగరేణిని బతికించుకుందాం

హైదరాబాద్, అక్టోబరు 7 (మనం న్యూస్): ప్రస్తుత పోటీ ప్రపంచంలో వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన సింగరేణి సంస్థను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని చెబుతూ 'సింగరేణిని బతికిద్దాం.. మనం బతుకుదాం' అని ఆ సంస్థ కార్మికులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ప్రభుత్వరంగ సంస్థలను బతికించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా రూ.400 కోట్లను నెలనెలా అందిస్తూ ఆర్టీసీకి బతికించుకుంటున్నామని చెప్పారు. సింగరేణి సంస్థను నిలబెట్టి ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. దసరా సందర్భంగా ఈనెల 11న ప్రతి బొగ్గుబావి దగ్గర సింగరేణి కార్మికులకు విందు ఏర్పాటు చేసి, సంస్థ వాస్తవిక స్థితిగతులు వివరించి, భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజాభవన్‌లో 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను సింగరేణి కార్మికులకు లాభాల్లో వాటా రూ.796 కోట్ల చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా భట్టి, విశిష్ట అతిథులుగా మంత్రులు పొంగులేటి, శ్రీధర్బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడారు. సింగరేణి లాభాల్లో వాటా కింద ఒక్కో కార్మికుడికి రూ.1.9 లక్షలు, దీపావళి బోనస్ కింద రూ.93,750, దసరా పండుగ అడ్వాన్స్ కింద రూ.25 వేల చొప్పున అందించనున్నామన్నారు. లాభాల్లో వాటా, దసరా, దీపావళి బోనస్ కలిపి ఈ నెలలో రూ.1,261 కోట్లను కార్మికులకు చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. తాడిచర్ల బొగ్గు గని సింగరేణికి కేటాయించాలని కోరామని, కోల్‌బెల్ట్‌లో ఒక్క గని బయటి వ్యక్తుల చేతికి వెళ్లకుండా అడ్డుకుంటామన్నారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు ప్రయోగాత్మకంగా కోల్‌బెల్ట్‌లోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. సింగరేణి మాజీ కార్మికులకు పింఛను పెంపుపై కమిటీ వేసి, సాధ్యసాధ్యాలపై చర్చించి, నిర్ణయం తీసుకుంటామన్నారు. వైద్య చికిత్స సీలింగ్ రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల దాకా పెంచుతున్నామన్నారు. అనంతరం పొంగులేటి మాట్లాడారు. కోల్‌బెల్ట్‌లో కార్మికులతో పాటు స్థానికులకు ఆధునిక విద్య, వైద్యం అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇళ్లకు సంబంధించి కార్మికులకు త్వరలో తీపి కబురు చెబుతామన్నారు. అనంతరం శ్రీధర్ బాబు మాట్లాడారు. ఎన్నికల కంటే ముందు ప్రతి వ్యవస్థలో మార్పు చూపిస్తామన్నామని ప్రకటించామని, ఆ మార్పు సింగరేణిలో కనిపిస్తోందన్నారు. కాగా సింగరేణి సమస్యలు పరిష్కరించాలని కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలు విజ్ఞప్తి చేశారు. కనీస వేతనాల అమలు కోసం జీవో నంబరు 22ను అమలు చేయాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రామగుండం ఎమ్మెల్యే మఖన్‌సింగ్ ఠాకూర్ విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ నియామకాల్లో ఎమ్మెల్యేలకు ప్రాతినిధ్యం ఇవ్వాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే జి.వినోద్, కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని చెన్నూరు ఎమ్మెల్యే జి.వివేక్ కోరారు. సింగరేణిలో నెలకు రూ.18 వేల లోపు పింఛన్ అందుకునే మాజీ కార్మికులు 90 శాతం మంది దాకా ఉన్నారని, శ్రీరాంపూర్లో 2500 ఎకరాల భూమిపై యాజమాన్య హక్కులను సాగుచేసుకుంటునవారికి ఇవ్వాలని మంచిర్యాల ఎమ్మెల్యే కె.ప్రేమ్‌సాగర్‌రావు డిమాండ్ చేశారు.

### ఏడేళ్లకు సరిపడా విద్యుత్తు డిమాండ్‌కు తగ్గట్లుగా ప్రణాళికలు

రానున్న ఏడేళ్లకు సరిపడా విద్యుత్తు డిమాండ్‌ను తీర్చడానికి వీలుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. ప్రస్తుతం 15,700 మెగావాట్లుగా ఉన్న పీక్ డిమాండ్... రానున్న ఏడేళ్లకు 27వేల మెగావాట్లకు చేరనుందన్నారు. దీనికోసం అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని నిర్దేశించారు. సోమవారం సచివాలయంలో ట్రాన్స్‌కోపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ట్రాన్స్‌కో సబ్ స్టేషన్ల నిర్మాణ పనులను నిర్ణీత వ్యవధిలోగా పూర్తిచేయాలన్నారు. ట్రాన్స్‌మిషన్ రంగంలో ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకోవడానికి వీలుగా రిసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి, దీనిపై అధికారులకు తగిన శిక్షణ అందించాలన్నారు.



మనం



# ఇంగ్లండ్ దూకుడు



## దక్షిణాఫ్రికాపై ఘన విజయం
## సఫారీలను కట్టడి చేసిన ఇంగ్లీష్ స్పిన్నర్లు
## రాణించిన వ్యాట్ హాడ్జ్, సీవర్

**షార్జా:** ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ వరుసగా రెండో విజయాన్ని నమోదుచేసింది. గ్రూప్-బీలో షార్జా వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్లో ఇంగ్లీష్ జట్టు 7 వికెట్ల తేడాతో గెలిచి సెమీస్ అవకాశాలను మరింత పటిష్టం చేసుకుంది. సౌతాఫ్రికా అటు బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ విఫలమై ఈ టోర్నీలో తొలి అపజయాన్ని మూటగట్టుకుంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న సౌతాఫ్రికా.. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 124 పరుగులు చేసింది. ఆ జట్టు సారథి లారా వోల్వార్డ్ (39 బంతుల్లో 42, 3 ఫోర్లు) మరోసారి కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడగా ఆల్రౌండర్ మరిజన్నె కాప్ (26) ఆఖర్లో వేగంగా ఆడింది. స్వల్ప ఛేదనను ఇంగ్లండ్.. 19.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఆల్‌రౌండర్ సీవర్ బ్రంట్ (36 బంతుల్లో 48 నాటౌట్, 6 ఫోర్లు) రాణించగా గత మ్యాచ్లో మాదిరిగానే ఓపెనర్ వ్యాట్ హాడ్జ్ (43 బంతుల్లో 43, 4 ఫోర్లు) మరో కీలక ఇన్నింగ్స్ ఆడింది. రెండు వికెట్లు తీసిన సోఫీ ఎకిల్స్టోన్ (2/15)కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.


### నత్తనడకన సఫారీ ఇన్నింగ్స్..

స్పిన్‌కు అనుకూలిస్తున్న షార్జాపై టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న లారా వోల్వార్డ్ ఎంత తప్పు చేసిందో అర్థం కావడానికి ఆ జట్టుకు పెద్దగా టైమ్ పట్టలేదు. సోఫీ ఎకిల్స్టోన్, చార్లీ డీన్, అలీస్ క్యాప్సీ వంటి నాణ్యమైన స్పిన్నర్లు కలిగిన ఇంగ్లండ్ ఆది నుంచే సఫారీలను కట్టడి చేశారు. బంతికో పరుగు చొప్పున ఆ జట్టు ఇన్నింగ్స్ సాగింది. ఓపెనర్ బ్రిట్స్ (13) డేనియల్ గిబ్సన్‌కు క్యాచ్ ఇచ్చింది. మధ్య ఓవర్లలో స్పిన్నర్లు కట్టుదిట్టంగా బంతు లేయడంతో సౌతాఫ్రికాకు పరుగుల రాక కష్టమైంది. 7 నుంచి 12వ ఓవర్ మధ్య సౌతాఫ్రికా 5 ఓవర్లలో 23 రన్స్ మాత్రమే చేయగలిగింది. 15 ఓవర్లలో ఆ జ ట్టు స్కోరు 85/2గా ఉన్నప్పటికీ చివరి ఓవర్లలో కూడా పరుగుల రాక గగనమవడంతో సౌతాఫ్రికా తక్కువ స్కోరుకే పరిమితమైంది.

### ఇంగ్లండ్దీ అదే కథ..

స్వల్ప లక్ష్యమే అయినప్పటికీ ఛేదనలో ఇంగ్లండ్ సైతం తడబడింది. కాప్ వేసిన తొలి ఓవరే మెయిడిన్ అయింది. తనే వేసిన 5వ ఓవర్లో కాప్.. బౌచర్ (5)ను ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పం పింది. 5 ఓవర్లలో ఇంగ్లండ్ చేసిన స్కోరు 16 పరుగులే. కానీ అలీస్ క్యాప్సీ (19) మూడు ఫోర్లు కొట్టి ఇన్నింగ్స్కు ఊపు తెచ్చింది. కానీ క్యాప్సీ.. డి క్లర్క్ బౌలింగ్‌లో ఆమెకు రిటర్న్ క్యాచ్ ఇచ్చింది. వికెట్లు కోల్పోయినా.. సీవర్, వ్యాట్ హాడ్జ్ మూడో వికెట్కు 64 పరుగులు జోడించి ఇంగ్లండ్‌ను గెలుపు తీరాలకు చేర్చారు.

## రిటైర్‌మెంట్ ప్రకటించిన దీపా కర్మాకర్!



భారత స్టార్ జిమ్నాస్ట్ దీపా కర్మాకర్ రిటైర్మెంట్ ప్రకటించింది. తనకు ఎంతో ఇష్టమైన ఆటకు వీడ్కోలు పలుకుతున్నానని సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. ఎంతో ఆలోచించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నానని, రిటైర్మెంట్ ప్రకటించడానికి ఇదే సరైన సమయంగా భావిస్తున్నట్లు పేర్కొంది. దేశంలో జిమ్నాస్టిక్స్ క్వీన్‌గా గుర్తింపు పొందిన దీపా కర్మాకర్.. 2011 నేషనల్ గేమ్స్‌లో నాలుగు ఈవెంట్లలో స్వర్ణ పతకాలు సాధించింది. 2014 ఆసియా ఛాంపియన్షిప్‌లో బ్రాంజ్ మెడల్ సాధించింది. వరల్ ఆర్టిస్టిక్స్ ఛాంపియన్షిప్‌తో పాటు ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన తొలి భారత మహిళా జిమ్నాస్ట్‌గా రికార్డ్ సృష్టించింది. 2016 రియో ఒలింపిక్స్‌లో 0.15 పాయింట్ల తేడాతో కాంస్య పతకాన్ని చేజార్చుకొని నాలుగో స్థానంలో నిలిచింది. అనంతరం ఆమెను స్ఫూర్తిగా తీసుకొని ఎంతోమంది అమ్మాయిలు జిమ్నాస్టిక్స్‌లో చేరారు. ఈ ఏడాది జరిగిన ఆసియా జిమ్నాస్టిక్స్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం గెలిచి.. ఈ ఘనత సాధించిన భారత తొలి జిమ్నాస్ట్‌గా చరిత్రకెక్కింది.

## ప్రీతి జింటా జట్టు టైటిల్ గెలిచిందోచ్..




ఐపీఎల్ ప్రారంభ సీజన్ నుంచి ఆడుతున్నా ఇప్పటివరకూ ట్రోఫీ నెగ్గని జట్లలో పంజాబ్ కింగ్స్ ఒకటి. ఐపీఎల్‌తో పాటు కరేబియన్ ప్రీమియర్ లీగ్ (సీపీఎల్)లోనూ పంజాబ్‌కు ఫ్రాంచైజీ ఉన్నా ఈ రెండు లీగ్‌లలో ఇప్పటిదాకా ఆ జట్టు టైటిల్ నెగ్గలేదు. కానీ ఎట్టకేలకు ఆ ఫ్రాంచైజీ కోరిక నెరవేరింది. ఆదివారం ముగిసిన సీపీఎల్ ఫైనల్లో సెయింట్ లూసియా కింగ్స్.. 6 వికెట్ల తేడాతో గయానా అమెజాన్ వారియర్స్‌పై గెలిచి టైటిల్ కైవసం చేసుకుంది. సెయింట్ లూసియాకు బాలీవుడ్ సొట్ట బుగ్గల సుందరి ప్రీతి జింటా సహ యజమానిగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన గయానా.. 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 138 పరుగులు చేసింది. ఫాఫ్ డుప్లెసిస్ సారథ్యంలోని సెయింట్ లూసి యా.. 18.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని పూర్తిచేసింది. ఆరోన్ జోన్స్ (48 నాటౌట్), రోస్టన్ చేజ్ (39 నాటౌట్) రాణించారు. చేజ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, నూర్ అహ్మద్‌కు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు లభించాయి.

## ఆ మ్యాచ్ తర్వాత రోహిత్ టెస్ట్‌లకు వీడ్కోలు పలుకుతాడు




టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ.. వరల్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ) 2025 ఫైనల్ తర్వాత సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలుకుతాడని అతని చిన్ననాటి కోచ్ దినేశ్ లాడ్ అన్నాడు. వన్డే క్రికెట్లో కొనసాగేందుకు రోహిత్ ఈ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని, అతను 2027 వన్డే ప్రపంచకప్ ఆడే అవకాశాలు ఉన్నాయని తెలిపాడు.

ఇటీవల టీ20 ప్రపంచకప్ 2024 గెలిచిన అనంతరం రోహిత్ శర్మ.. అంతర్జాతీయ టీ20లకు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. వరల్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025 పాయింట్స్ టేబుల్లో అగ్రస్థానంలో కొనసాగుతున్న టీమిండియా.. తదుపరి 8 మ్యాచ్‌లో 3 విజయాలు సాధిస్తే ఫైనల్ చేరుతోంది. ఈ టోర్నీ ఫైనల్ తర్వాత రోహిత్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెబుతాడని జోరు ప్రచారం జరుగుతుంది. 37 ఏళ్ల వయసున్న రోహిత్.. టీమిండియాకు మరో ఐసీసీ టైటిల్ అందించి గుడ్‌బై చెబుతాడని అతని ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు.

ఈ క్రమంలోనే అతని చిన్ననాటి కోచ్ దినేశ్ లాడ్.. రోహిత్ శర్మ రిటైర్మెంట్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'రోహిత్ శర్మ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్షిప్ తర్వాత రిటైర్మెంట్ ప్రకటిస్తాడా? అంటే అవునని కచ్చితంగా చెప్పలేను. కానీ వయసు మీద పడుతున్నందున టెస్ట్ క్రికెట్‌కు గుడ్‌బై చెబుతాడనిపిస్తోంది. వన్డే క్రికెట్లో కొనసాగేందుకు.. పూర్తిగా ఫిట్గా ఉండటం కోసం అతను ఈ నిర్ణయం తీసుకోవచ్చు. రోహిత్ శర్మ 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడుతాడని నేను 100 శాతం నమ్ముతున్నా. ప్రస్తుతం రోహిత్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు.'అని దినేశ్ లాడ్ చెప్పుకొచ్చాడు.

ప్రస్తుతం రోహిత్ వెకేషన్లో ఉన్నాడు. కుటుంబ సభ్యులతో కలిసి దుబాయ్‌లో ఎంజాయ్ చేస్తున్నాడు. బంగ్లాదేశ్‌తో రెండు టెస్ట్‌ల సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకున్న రోహిత్ సేన.. ఈ నెల 16న న్యూజిలాండ్‌తో ప్రారంభం కానున్న టెస్ట్ సిరీస్‌తో మళ్లీ రీఎంట్రీ ఇవ్వనుంది. మరోవైపు బంగ్లాదేశ్‌తో సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని యంగ్ ఇండియా టీ20 సిరీస్ ఆడుతోంది. పొట్టి ఫార్మాట్‌కు టెస్ట్ సిరీస్ ఆడిన ఆటగాళ్లను దూరంగా ఉంచారు. దాంతో వారంత కుటుంబ సభ్యులతో గడుపుతున్నారు.

# శ్రీను వైట్ల ఈజ్ బ్యాక్



గోపీచంద్ హీరోగా డైరెక్టర్ శ్రీను వైట్ల రూపొందించిన సినిమా 'విశ్వం'. కావ్యా థాపర్ హీరోయిన్. దసరా కానుకగా ఈ నెల 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ ఈవెంట్ను సోమవారం నిర్వహించారు. గోపీచంద్ మాట్లాడుతూ.. ''పలు సమస్యాత్మక ప్రాంతాల్లో ఈ సినిమా షూటింగ్ చేశాం. సాంకేతిక నిపుణలంతా చాలా కష్టపడ్డారు. ఈ సినిమాకి చైతన్ భరద్వాజ్ అందించిన సంగీతం చాలా కొత్తగా ఉంది. ఇందులోని తొలి పాట విన్నప్పుడు.. 'ఇండియాలోనే టాప్ మ్యూజిక్ డైరెక్టర్ స్వరపరిచిన పాటలా ఉంది' అని శ్రీను వైట్లకు చెప్పా. శ్రీనుతో సినిమా చేయాలని ఎప్పుడో అనుకున్నా. ఆ కల రెండేళ్ల క్రితం నెరవేరింది. ముందుగా సినిమాకి సంబంధించి ఓ పాయింట్ చెప్పారు. అయితే, అది నాకు సెట్ కాదేమోనని సందేహించా. కొత్త వారికి బాగుంటుందని చెప్పా. ఏడు నెలల సమయం తీసుకుని, పూర్తి స్క్రిప్టు సిద్ధం చేసుకుని వినిపించారు. ఆయన కథ చెబుతున్నంత సేపు నవ్వుతూనే ఉన్నా. సన్నివేశం బాగా పండేందుకు ఆయనే ముందుగా నటించి, చూపిస్తుంటారు. ఆయన వద్ద కంఫర్ట్ ఫీలయ్యా. ఈ సినిమా చూసే ప్రేక్షకులకు నవ్వు ఆగదని నమ్మకంగా చెబుతున్నా. ఒక్క మాటలో చెప్పాలంటే.. శ్రీను వైట్ల ఈజ్ బ్యాక్'' అని పేర్కొన్నారు.

# రొమాంటిక్ సినిమాలు చేయాలనుంది

'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2', 'లైగర్', 'డ్రీమ్గర్ల్ 2'లాంటి చిత్రాలతో ప్రేక్షకులకు దగ్గరయ్యారు అనన్య పాండే. ప్రస్తుతం వరుస సినిమాల్లో నటిస్తూ అలరిస్తున్నారు. తాజాగా 'కంట్రోల్'తో మరోసారి పలకరించారు. ఈ సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తనకు బాలీవుడ్‌లో కొంతమంది దర్శకుల సినిమాల్లో నటించాలనుందని మనసులో కోరికను బయటపెట్టారు. ''కరణ్ జోహర్ సినిమాలో హీరోయిన్‌గా నటించాలనేది నా కోరిక. ఆయన దర్శకత్వంలో వచ్చిన 'రాకీ ఔర్ రాణికి ప్రేమ్ కహానీ'లో చిన్న పాత్ర పోషించే అవకాశం వచ్చింది. కానీ, ఆయన సినిమాలో హీరోయిన్‌గా నటించే అవకాశం కోసం ఎదురుచూస్తున్నా. అలాగే సంజయ్‌లీలా భన్సాలీ నాకెంతో ఇష్టమైన దర్శకుడు. సంజయ్ సినిమాలో ఛాన్స్ రావాలని కోరుకుంటున్నా. కెరీర్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు ఎన్నో జానర్ సినిమాల్లో నటించాను. రొమాంటిక్, హారర్, బయోపిక్‌లలో ఎక్కువగా నటించాలనుంది. ప్రస్తుతం కెరీర్ పరంగా బిజీగా ఉన్నాను. తొలి సినిమా నుంచి ఇప్పటివరకు ఎన్నో విషయాలు నేర్చుకున్నా' అని చెప్పారు. ఇక తన సోషల్ మీడియా అకౌంట్ గురించి మాట్లాడుతూ.. 'చిన్నప్పుడు ఓ ఫేస్బుక్ అకౌంట్ ఓపెన్ చేశాను. అది మా అమ్మకు తెలిసి దాన్ని డీయాక్టివేట్ చేసింది. 18 ఏళ్లు నిండిన తర్వాత మళ్లీ సోషల్ మీడియాలోకి వచ్చాను. విరామ సమయంలో సోషల్ మీడియాలో ఉండడానికి ఇష్టపడతాను. నాకు నచ్చిన సినిమాల గురించి అభిమానులతో పంచుకుంటాను' అని చెప్పారు.



# పొట్టేల్ నేపథ్యంలో



యువచంద్రకృష్ణ, అనన్య నాగళ్ల లీడ్‌రోల్స్ చేస్తున్న చిత్రం 'పొట్టేల్'. సాహిత్ మోత్ఖూరి దర్శకుడు. నిశాంక్‌రెడ్డి కుడితి, సురేష్‌కుమార్ సడిగె నిర్మాతలు. ఈ నెల 25న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది. ఈ విషయాన్ని సోమవారం ఓ ప్రకటన ద్వారా మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా రిలీజ్డేట్ పోస్టర్‌ని కూడా విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో యువచంద్రకృష్ణ, అనన్య నాగళ్ల, వారితోపాటు ఓ పాప ఉన్నారు. మరో పార్ట్‌లో హీరోని గ్రామస్తులు వెంబడిస్తున్నట్టు కనిపిస్తున్నది. మొత్తంగా కథలోని ఉద్వేగాన్ని పోస్టర్ ఆవిష్కరించిందని చెప్పొచ్చు. అజయ్, ప్రియాంకశర్మ, తనస్వి చౌదరి, నోయల్సీన్, చత్రపతి శేఖర్, శ్రీకాంత్ అయ్యంగార్, జీవన్, రియాజ్, విక్రమ్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మోనిష్ భూపతిరాజు, సంగీతం: శేఖర్‌చంద్ర, నిర్మాణం: నిసా ఎంటర్‌టైన్‌మెంట్స్, ప్రజ్ఞ సన్నిధి క్రియేషన్స్.

# ఎస్ఎస్ఎంబీ 29 సినిమాపై సూపర్ హైప్

తెలుగు, తమిళంతోపాటు పాన్ ఇండియా మూవీ లవర్స్ ఎక్సైటింగ్గా ఎదురుచూస్తున్న సినిమా ఎస్ఎస్ఎంబీ 29. టాలీవుడ్ సూపర్ స్టార్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి-మహేశ్ బాబు కాంబోలో గ్లోబల్ అడ్వెంచరస్ ప్రాజెక్టుగా తెరకెక్కనున్న ఈ సినిమాపై అంచనాలు భారీగానే నెలకొన్నాయి. మహేశ్ బాబు ఈ సినిమా కోసం కంప్లీట్ కొత్త అవతారంలో కనిపించబోతున్నాడని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇప్పటికే లాంగ్ హెయిర్, పోనీ టెయిల్‌తో కనిపించిన ఈ స్టార్ యాక్టర్ మరో లుక్‌లో కనిపించి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తున్నాడు. ఈ సినిమా కోసం మహేశ్ బాబు మరోసారి మేకోవర్ మార్చేసుకుని.. కొత్త కొత్త గెటప్స్లో కనిపిస్తూ నెట్టింట సందడి చేస్తున్నాడు. తాజాగా మహేశ్ బాబు ఫ్యామిలీతో కలిసి వెకేషన్‌కు వెళ్తున్న సమయంలో ఎయిర్పోర్టులో లాంగ్ హెయిర్, గడ్డం, రెడ్ క్యాప్, హుడీ వేసుకుని స్టైలిష్గా నడిచి వస్తుండగా.. అక్కడే ఉన్న కెమెరాలు క్లిక్‌మనిపించాయి. తాజాగా ఫొటోలు జక్కన్న సినిమాపై క్యూరియాసిటీ మరింత పెంచేస్తున్నాయి. ఆఫ్రికన్ అడ్వెంచరస్ ప్రాజెక్ట్‌లా ఇంటర్నేషనల్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో రాబోతున్న ఈ చిత్రాన్ని దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. కాగా ఈ చిత్రంలో మహేశ్ బాబు పాత్ర డైలాగ్ డెలివరీ మాండలికం, పదాల ఉచ్చరణ వంటి అంశాలను పాపులర్ యాక్టర్ నాజర్ దగ్గరుండి చూసుకోనున్నారంటూ ఇప్పటికే ఓ వార్త నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రాన్ని 2027 మొదటి త్రైమాసికంలో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయాలని జక్కన్న టీం ప్లాన్ చేస్తున్నట్టు సమాచారం.



Printed and Published by **VUPPARI RAMESH KUMAR** on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No: 3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No. 23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidu pet, Guntur (District), AP-522002. **EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.**